నమ్మలేని నిజాలు

దొంగ కుక్కలు
పేదల బువ్వ మెక్కుదు
ఖులా దర్వాజా

స్థానిక వైరం
పడమర చదువు
తూర్పుకు దండం

గెలుపు చిత్రం
ముందేను విడుదల
ఆశకు జీవం.

వేడికి నివృత్తి
వస్తుందంటా నైరుతి
రైతుకు సద్గతి.

చెరువు మాయం
కొత్తకాలనీ ఖాయం
ప్రస్తుత న్యాయం



- రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

శ్రీనిజాలు

ప్రధాని మోదీ ఏదీ
పరీక్షా పే చర్చేది?
అనుమానం ఆరోపణ
ఏది నీకు నచ్చేది?.

కష్టపడే విద్యార్థులు
నీట్ పైన ఆందోళన !
జరపాలి సిట్టింగ్ జడ్జ్ తొ
సమగ్ర మైన విచారణ !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ గురువారం 27-6-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:256 పేజీలు:6 వెల: రూ.1/-


## తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధిగా జితేందర్ రెడ్డి..

### -ముఖ్యమంత్రి రేవంత్ సమక్షంలో ఢిల్లీలో బాధ్యతలు
### -అభినందించిన మంత్రి పొంగులేటి, ఇతర ప్రజా ప్రతినిధులు



హైదరాబాద్, జూన్ 26 :పార్లమెంట్ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరిన బీజేపీ నేత ఏపీ జితేందర్ రెడ్డికి కాంగ్రెస్ కీలక బాధ్యతలు అప్పగించింది. ఈ క్రమంలో ఆయన ఈరోజు ఉదయం ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధిగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు..

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ హక్కుల కోసం కృషి చేస్తానన్నారు. విభజన అంశాల పరిష్కారం, కృష్ణానదిలో సమాన వాటా, రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా చెప్పారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల సాధన కోసం పని చేస్తానని చెప్పారు. మరోవైపు స్పోర్ట్స్ అడ్వైజర్ గా రాష్ట్రంలో క్రీడా సౌకర్యాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తానని, తెలంగాణను స్పోర్ట్స్ హబ్ గా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తానన్నారు. 2036లో ఒలింపిక్స్ క్రీడలను నిర్వహించే అవకాశం భారత దేశానికి వస్తే.. హైదరాబాద్ లోనూ కొన్ని ఈవెంట్ నిర్వహించేలా తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు.

## వారిపై అనర్హత వేటు వేయండి-పోచారం, సంజయ్ లపై స్పీకర్ కు బీఆర్ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్, జూన్ 26 :మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌పై బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్‌కు ఫోన్ చేసిన స్పందించకపోవడంతో ఆయన ఈ-మెయిల్, స్పీడ్ పోస్ట్ ద్వారా వారిపై ఫిర్యాదు చేశారు. వారు గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో జగదీశ్ రెడ్డి ఫిర్యాదు చేశారు. పార్టీ మారిన ఆ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసన సభ సెక్రటరీకి ఫిర్యాదు చేశారు. ఇదివరకు పార్టీ మారిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులపై కూడా ఫిర్యాదు చేశారు.

## బోనమెత్తనున్న భాగ్యనగరం.. ఆషాఢ బోనాలకు రూ. 20 కోట్లు మంజూరు

హైదరాబాద్, జూన్ 26 :భాగ్యనగరం బోనమెత్తనుంది. జులై 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఆషాఢ బోనాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలోనే ఆషాఢ బోనాలకు రూ. 20 కోట్లు మంజూరు చేసింది ప్రభుత్వం. ఈ మేరకు దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆషాఢ బోనాల ఏర్పాట్లపై దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం సమీక్ష నిర్వహించారు. బేగంపేటలోని హరిత ప్లాజాలో ఈ సమీక్ష జరిగింది. సమీక్షలో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు. ఈ ఏడాది జులై 7 నుంచి 29తేదీ వరకు అత్యంత వైభవంగా బోనాల పండుగను నిర్వహించనున్నారు.

ఆషాఢంలో వచ్చే మొదటి ఆదివారం(జులై 7) రోజు భాగ్యనగరంలో బోనాల సంబరం ప్రారంభమవుతుంది. గోల్కొండ శ్రీ ఎల్లమ్మ ఆలయంలో తొలిపూజ నిర్వహించిన తర్వాత సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి, లాల్ దర్వాజ మహంకాళి ఆలయంలో నెలరోజుల పాటూ ప్రతి గురువారం, ఆదివారం ప్రత్యేక పూజలు జరుగుతాయి. మళ్లీ గోల్కొండ కోటలోనే చివరి రోజు పూజ నిర్వహించడంతో బోనాల ఉత్సవాలు ముగుస్తాయి.

బోనాల జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వస్తారని, మెట్రో, ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు నడపాలని మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు. ఉచిత బస్సు సౌకర్యం ఉండటం వల్ల ఎక్కువ భక్తులు వచ్చే అవకాశం ఉంటుందని, అందుకు తగ్గట్లుగా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఉత్సవాల్లో కళాబృందాలను తీసుకురావడంతో పాటు, లేజర్ షోలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

## జూడాల సమ్మెకు దిగొచ్చిన కాంగ్రెస్ సర్కార్.. ఆ మూడు మెడికల్ కాలేజీలకు రూ. 204.85 కోట్లు కేటాయింపు




హైదరాబాద్, జూన్ 26 : ప్రభుత్వ వైద్య కాలేజీల్లో పని చేస్తున్న జూనియర్ డాక్టర్లు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మెబాట పట్టిన సంగతి తెలిసిందే. నిన్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాతో జరిపిన చర్చలు అసంపూర్ణంగా ముగిశాయి.ప్రతి నెల స్టైఫండ్ కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని, గ్రీన్ ఛానెల్ ఏర్పాటు ప్రతి నెలా స్టైఫండ్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని జూడాలు డిమాండ్ చేశారు. దీంతో పాటు పెరుగుతున్న మెడిసిన్ సీట్లకు అనుగుణంగా హాస్టళ్ల వసతి సౌకర్యాలు పెంచాలి. ఉస్మానియా ఆస్పత్రికి కొత్త భవనం నిర్మించకపోవడంతో భయంభయంగా వైద్యసేవలు అందించాల్సి వస్తుంది. వెంటనే కొత్త భవనం నిర్మించాలి. అలాగే కాకతీయ మెడికల్ కాలేజీలో రోడ్లు అధ్వానంగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని.. ఈ సమస్యలను పరిష్కరించాలని జూడాలు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని ప్రభుత్వానికి తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో జూడాల సమ్మెకు కాంగ్రెస్ పర్కార్ దిగొచ్చింది. వసతి గృహాల నిర్మాణం, రోడ్ల పునరుద్ధరణకు నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంకా మిగతా డిమాండ్లపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

ఉస్మానియా, గాంధీ, కాకతీయ మెడికల్ కాలేజీలకు నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీల్లో జూనియర్ వైద్యుల వసతి గృహాల నిర్మాణానికి, కాకతీయ మెడికల్ కాలేజీలో రహదారుల పునరుద్ధరణకు నిధులు కేటాయిస్తూ జీవో విడుదలైంది. ఉస్మానియా, గాంధీ, కాకతీయ మెడికల్ కాలేజీలకు రూ. 204.85 కోట్లు కేటాయించారు. ఉస్మానియా వసతి భవనాలు, రోడ్లకు రూ. 121.90 కోట్లు, గాంధీ ఆస్పత్రికి రూ. 79.50 కోట్లు, కాకతీయ మెడికల్ కాలేజీలో సీసీ రోడ్లకు రూ. 2.75 కోట్లు కేటాయించారు.

## దేశ వ్యాప్తంగా కుల ఆధారిత జన గణన చేపట్టాలి.. తమిళనాడు అసెంబ్లీ తీర్మానం



చెన్నై, జూన్ 26 : దేశ వ్యాప్తంగా కుల ఆధారిత జనాభా గణన చేపట్టాలని తమిళనాడు ప్రభుత్వం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఒక తీర్మానాన్ని ఆ రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించారు. కుల ప్రాతిపదికన జన గణనతో పాటు జనాభా గణనను వెంటనే ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం ఎంకే స్టాలిన్ కోరారు. బుధవారం ఆ రాష్ట్ర అసెంబ్లీలో ఒక తీర్మానాన్ని ఆయన ప్రవేశపెట్టారు. 'దేశంలో ప్రతి పౌరుడికి విద్య, ఆర్థిక, ఉపాధిలో సమాన హక్కులు, సమాన అవకాశాలను నిర్ధారించడానికి, విధానాలు రూపొందించడానికి కుల ఆధారిత జనాభా గణన చాలా అవసరమని ఈ సభ భావిస్తోంది' అని తెలిపారు. ఈసారి కుల ఆధారిత జనాభా గణనతో పాటు 2021 నుంచి జరుగాల్సిన జనాభా గణనను వెంటనే ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఈ సభ ఏకగ్రీవంగా కోరుతోందని ఆ తీర్మానంలో పేర్కొన్నారు.

కాగా, కళ్లకురిచ్చిలో 60 మందికిపైగా మరణించిన కల్తీ మద్యం దుర్ఘటనపై డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు అసెంబ్లీలో నినాదాలు చేశారు. సీఎం ఎంకే స్టాలిన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామితోపాటు అన్నాడీఎంకేకు చెందిన పలువురు ఎమ్మెల్యేలను సభ నుంచి సస్పెండ్ చేశారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో జాప్యమేల-. హైకోర్టు ప్రశ్న

హైదరాబాద్, జూన్ 26 : కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఆలస్యం ఎందుకు చేస్తున్నారని రేవంత్ రెడ్డి సర్కార్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం చేసింది. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి పొన్నం ప్రభాకర్ పంచనివ్వడం లేదని. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలతో అధికారులు చెక్కులు పంపిణీ చేయకుండా ఆపుతున్నారని హైకోర్టులో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ నెల 27 వరకు చెక్కులు పంపిణీ చేయకుంటే బౌన్స్ అయ్యే ప్రమాదం ఉందని, త్వరగా పంచడానికి అనుమతులు ఇప్పించాలని కౌశిక్ రెడ్డి కోర్టును అభ్యర్థించారు.

ఈ పిటిషన్ ను విచారించిన కోర్టు చెక్కులను పంపిణీ చేయకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని అధికారులను కోర్టు ప్రశ్నించింది. చెక్కుల పంపిణీలో ఎందుకు ఆలస్యమైందో చెప్పాలని అధికారులకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

## మాదకద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యత- సిద్దిపేట సీపీ అనురాధ



సిద్దిపేట , జూన్ 26 : మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పోలీస్ కమిషనర్ బి.అనురాధ పిలుపునిచ్చారు. బుధవారం మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించి విద్యార్థినీ విద్యార్థులు, కార్యాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఉపన్యాసం, పెయింటింగ్, గెలుపొందిన విద్యార్థులకు ఫస్ట్, సెకండ్, థర్డ్, సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ? ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని కళాశాల, పాఠశాల యాజమాన్యాలకు సూచించారు. పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలని తెలిపారు. యువత ఎంతో బంగారు భవిష్యత్తు కలిగి ఉండవలసిన వారు కొంతమంది చెడుమార్గాల వైపు ఆకర్షితులవుతున్నారని, మత్తుకు అలవాటు పడి గంజాయి అలవాటు చేసుకుని జీవితాలు నాశనం చేసుకుంటున్నారని వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు మానవుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని, నరాలు, గుండె సహ ప్రధాన అవయవాలు దెబ్బతినే అవకాశం ఉన్నదని తెలిపారు. గ్రామాల్లో, పట్టణాల్లో యువతీ యువకులు మంచి అలవాట్లతో తల్లిదండ్రులు, గురువులు చెప్పిన మాటలు విని చదువుతూ ముందుకు వెళితే చక్కని భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. మాదకద్రవ్యాల విషయంలో ఎంత పెద్ద వారు ఉన్నా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలకు యువతను దూరంగా ఉంచాలని, డ్రగ్ రహిత తెలంగాణ సమాజం కోసం అందరూ కృషి చేయాలని సూచించారు.

జూన్ 26న మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంకల్పంతో డ్రగ్-రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న క్రమంలో మత్తు పదార్థాలను అరికట్టేందుకు యువత/విద్యార్థులు అంతా యాంటీ డ్రగ్స్ కమిటీల్లో సభ్యులుగా చేరి యాంటీ డ్రగ్స్ సోల్జర్ గా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా వారం రోజుల పాటు పట్టణాలు, మండలాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ

తాము మాదకద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగంపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామి అవుతానని, వీటి వాడకం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండి, తనతో పాటు ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు చేసే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియపరుస్తానని, డ్రగ్-రహిత సమాజం లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామినౌతానని ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. పోలీస్ కళాబృందం, తెలంగాణ సాంస్కృతిక సారధి బృందం డ్రగ్స్ గురించి దాని వినియోగం వల్ల జరిగే నష్టాల గురించి పాటల ద్వారా, విద్యార్థినీ విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఎస్.మల్లారెడ్డి, ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ మధు, ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాస్ మూర్తి, డీడబ్ల్యూఓ శారద, ఇన్స్పెక్టర్లు లక్ష్మీబాబు, విద్యాసాగర్, ఉపేందర్, రామకృష్ణ, ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, సీసీఆర్బీ ఇన్స్పెక్టర్ గురుస్వామి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ధరణి కుమార్, రాజేష్, పూర్ణ చందర్, ప్రసాద్, కమిషనర్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, ప్రభుత్వ, ప్రవేట్ కళాశాలల, స్కూళ్ల యాజమాన్యం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగాల కోసం బిక్షాటన..గురుకుల అభ్యర్థులకు హరీశ్ మద్దతు..

హైదరాబాద్, జూన్ 26 : గురుకుల అభ్యర్థుల నిరసనకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు మద్దతు ప్రకటించారు. అభ్యర్థుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. రాజకీయాలే పరమావధిగా నడుస్తున్న సోకాల్డ్ ప్రజా ప్రభుత్వానికి గురుకుల టీచర్ పోస్టుల అభ్యర్థుల బాధలు కనిపించకపోవడం బాధాకరం అని హరీశ్‌రావు అన్నారు. ఈ మేరకు ఆయన ట్విట్ చేశారు.. మంత్రులు, అధికారులను కలిసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా, సీఎం ఇంటి ముందు మోకాళ్ళ మీద నిలబడి ఎన్ని సార్లు అభ్యర్థించినా అభ్యర్థుల మొర అలకించకపోవడం శోచనీయ మని పేర్కొన్నారు. పేద, బడుగు, బల హీన వర్గాల పిల్లలకు అత్యున్నత, నాణ్యమైన రెసిడెన్షియల్‌తో కూడిన విద్యను పూర్తి ఉచితంగా అందించే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద సంఖ్యలో గురుకులాలు ఏర్పాటు చేసింది అని మాజీ మంత్రి గుర్తు చేశారు.ఇది ఇలా ఉంటే తమ ఉద్యోగాలు ఇప్పించండి అంటూ పెద్దమ్మ గుడి ముందు గురుకుల అభ్యర్థులు భిక్షాటన చేశారు. రేవంత్ రెడ్డి ఇంటి ముందు ఆందోళన తెలపడానికి అనుమతిం చకపోవడంతో పెద్దమ్మ గుడి ముందు భిక్షాటన చేసుకునే వారితో కలిసి కూర్చొని అడుక్కుంటూ నిరసన తెలిపారు. రేవంత్ రెడ్డి ఇంటివద్ద లేకపోవడంతో ఆయన ఢిల్లీలో ఉండటంతో ఆయన ఫ్లెక్సీకి వినతి పత్రం అందించారు. రేవంత్ రెడ్డి ఇంటి ముందు గురుకుల అభ్యర్థులు మోకాళ్ళ మీద కూర్చొని కొంగు పట్టి చాచి అడుక్కున్నారు.

## ఆరోగ్యం పై ప్రత్యేక ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలి



హైదరాబాదు జూన్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని మరియు ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని మదర్ మేరి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ సాయి చౌదరి కోరారు. నేడు బోరబండలో మదర్ మేరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ సాయి చౌదరి మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీటిని ఎక్కువ కాలం నిలువ ఉండకుండా మార్చాలని సూచించారు. పరిసర ప్రాంతాలలో అపరిశుభ్రంగా ఉంటే సంబంధిత అధికారులకు తెలిపి సమస్యను పరిష్కరించుకోవాలని మదర్ మేరి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ సాయి చౌదరి తెలిపారు.






చురక

అవకాశవాదాలలో
అద్భుత ప్రావీణ్యం
అవుతున్నది నేతల్లో
అది సర్వసామాన్యం
అధికార రాజకీయ
అక్రమార్గ తప్పు సదా
నేడు ప్రోత్సహిస్తే రేపు
నిజంగా ముప్పు కదా



-వేల్పుల నారాయణ
9440433475

నేటి కందం– నేటికీ అందం

మనమునగల రుగ్మతలను
పనివడి వెలుపలకు తీసి వైద్యము జేయన్
ఘనముగ పీ టీ ఎస్ డీ
దినమును జరుపంగవలయు దీధితు లొప్పన్
(జూన్ 27 మానసిక రుగ్మతల అవగాహనాదినం..)



-రాధశ్రీ
సెల్:9494481210






## సునందామృతం

### తులా యష్టి న్యాయము

తులా అంటే త్రాసు,తరాజు, పోలిక, సామ్యము అనే అర్థాలు ఉన్నాయి.యష్టి అంటే కర్ర,ఊత కర్ర, స్తంభము, దండము అనే అర్థాలు ఉన్నాయి.'తులా యష్టి' అంటే త్రాసుకు ఉన్న కర్ర లేదా దండము.

త్రాసు యొక్క దండము బరువు యొక్క తేడాలను బట్టి క్రింద మీద అగునట్లే అల్పుడు తనకు సంభవించెడు,బాధ నష్టములను బట్టి సుఖ దుఃఖాలను అనుభవించడాన్ని తులా యష్టి న్యాయము అంటారు.

త్రాసులో ఏదైనా చిన్న వస్తువు వేసినా మరొక వైపు పైకి పోతుంది. తూకం సరిగా వేయనంత వరకు అది అటూ ఇటూ ఊగిసలాడుతూనే ఉంటుంది. అంటే బరువు యొక్క తేడాలను బట్టి క్రింద మీద అవడం సహజం.

మనసును త్రాసుగా భావిస్తే సంభవించే రకరకాల అనుభవాలు మన దైనందిన జీవితాన్ని క్రింద మీదు చేస్తూ ఉంటాయి.అవి సహజమే అని భావించే వారు వాటిని ఒకే విధంగా స్వీకరిస్తారు.కానీ చిన్న దానికే కృంగి,పొంగి పోయేవారు ప్రశాంతంగా ఉండలేరు.అలా భావించే వారు అల్పులు అంటారు.అల్పం అంటే కొంచెం, తక్కువ.అల్పుడు అంటే కొంచెం ,తక్కువ ఆలోచనలు చేసేవాడు.

తక్కువ అంటే ఇతడిలో తన వరకే ఆలోచించే గుణం ఉంటుంది.ఏదైనా తనకు మంచి జరిగితే చాలు అనుకునే వాడు.మొత్తంగా విశాల హృదయం లేని వాడు అని చెప్పవచ్చు.

దీనికి నారాయణ పండితుడు రచించిన హితోపదేశం గ్రంథంలోని శ్లోకాన్ని చూద్దాం." అయం నిజః పరో వేతి గణనా లఘు చేతసాం/ ఉదార చరితానాం తు వసుధైవ కుటుంబకం!"

అంటే వీడు నా వాడు వాడు పరాయి వాడు... అని అనుకునే వాడు లఘు చేతనుడు అంటే అల్పుడు.స్వపర భేదం లేకుండా సమస్త లోకం తనదిగా భావించి ధర్మ బుద్ధితో నడిచే వాడు ఉదారుడు.కవి గంగుల శాయిరెడ్డి గారు రాసిన 'కాపు బిడ్డ' పద్య కావ్యంలో ఇలా అంటారు.

'కష్ట సుఖముల నొక రీతి గడుపు వారు/ శత్రు మిత్రుల సమముగా సైచు వారు/ సైరికులుదప్ప నంతటి శాంతులెవరు? కాన చేమోడ్చి వారి నే గౌరవింతు".... అంటే రైతుకు తన వ్యవసాయంలో ఎన్నో రకాల ఒడుదుడుకులు వస్తూ ఉన్నా వాటన్నింటినీ సమముగా శాంతమైన మనసుతో భరిస్తూ ఉంటాడని అర్థం.

తులా యష్టి న్యాయము వలె కృంగి పోవడం, పొంగి పోవడం కాకుండా ,తన వరకే పరిమితంగా ఆలోచించకుండా ఉదారుడుగా ఆలోచిస్తూ అన్నింటినీ సమముగా స్వీకరించాలనే సత్యాన్ని గ్రహించాలి.



-పురిమళ్ల సునంద
9441815722

# నేటి నిజం సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 27-6-2024


## రాలే ఆకు



వాడి పడేసిన విస్తరిలా
మాసి చినిగిన బిస్తర్‌లా
ఏ ఆసుపత్రిలోనో
ఆ ఆశ్రమంలోనో
కానరాని కొడుక కోసం
జాడలేని యముడి కోసం
ఓ యోగినిలా, ఓ త్యాగిలా–
దీనంగా శూన్యంలోకి
చూస్తోన్న ఓ ముసలితనమా!



–ఎన్.విజయా కిషన్ రెడ్డి
98488 68085

## ఘంటారావం

నేత్రానికి మించిన
చిత్రం ఏముంది?
నాలుకను మించిన
ఏలిక ఎక్కడుంది?

విలువల్ని
వల్లిస్తే ప్రవచనం
ఆచరిస్తే
ఆదర్శ ప్రేరణ.

జీవితం
నీటిబుడగ
ప్రపంచం
పాముపడగ

విభిన్నమైనవి
మనుషుల స్వభావాలు
స్వభావాలను
మార్చగలిగేవి అనుభవాలు.

చెడ్డవారిని
చేరదీయకు
మంచితనానికి
మచ్చ రానీయకు



–గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

## 'నా చూపు దేశంవైపు' ఆచార్య మసన చెన్నప్ప కవిత్వం ఆవిష్కరణ

### 'నా చూపూ దేశం వైపే'– జొన్నవిత్తుల



పుస్తకావిష్కరణలో శ్రీమతి గూడూరు నిర్మల, గూడూరు మహేందర్ రెడ్డి, వామరాజు సత్యమూర్తి, బైస దేవదాసు, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య మసన చెన్నప్ప, ఆవిష్కర్త జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, సి.హెచ్. లక్ష్మీనారాయణ, శంకర నారాయణ, రావూరి వనజ, డా॥ కస్తూరి లక్ష్మీనారాయణ, డా॥ వెంకటేశ్వర రాజు.

హైదరాబాద్, జూన్ 26 : (నేటినిజం ప్రతినిధి): 'ప్రమీలా శక్తి పీఠం ఆధ్వర్యంలో 'ఆర్షకవి' ఆచార్య మసన చెన్నప్ప రచించిన **'నా చూపు దేశం వైపు'** కవిత్వ ఆవిష్కరణ సభ ఆదివారం శివానందాశ్రమంలో జరిగింది. ఈ కవి తీసుకువచ్చిన 'ఈశ్వర స్తుతి ధ్యానమంత్రం' అనే చిరు పుస్తకాన్ని కూడా ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కవి వరేణ్యులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి (జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షులు) సభకు అధ్యక్షత వహించారు. సినీ కవి జొన్నవిత్తుల రామ లింగేశ్వర రావు ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. తన చూపు కూడా దేశం వైపే నని జొన్నవిత్తుల పేర్కొన్న దం విశేషం. 'జ్ఞాని, సంస్కారి, సూరి, సంస్కృతి ప్రచారి మసన చెన్నప్పగొప్ప అని జొన్నవిత్తుల కీర్తించారు. స్ఫూర్తి పొందే కవిత్వాన్ని ఈ కవి రాసారని అభినందించారు. ఈ కవిత్వం సమాజానికి వరం అని అన్నారు. పలు కవితలను చదివి కవి ఆలోచనలను ప్రేక్షకులకు వివరించారు. గూడూరు మహేంద ర్‌రెడ్డి (వీహెచ్‌పీ ప్రాంతసభ సంపర్క్ ప్రముఖ్) గూడూరునిర్మల దంపతులకు ఈ పుస్తకాన్ని కవి అంకితమిచ్చారు. ఇది చింతన పెంచే కవిత్వమని ఆచార్య చెసన చెన్నప్ప పేర్కొన్నారు. 40 సంవత్సరాల బోధనానుభవం, 52 గ్రంథాలను రచించిన కవి ఓయూ తెలుగుశాఖ అధ్యక్షులుగా వ్యవహరించారు. మహర్షి దయానంద సరస్వతి చూపిన మార్గంలో ఉన్నారు ఈ కవి. తెలుగునాట ఆర్య సమాజ స్థాపకులు గోపదేవుని శిష్యునిగా వీరు కీర్తి ఘడించారు. దేశభక్తి, దైవభక్తి గల కవిగా ఆచార్య కసిరెడ్డి అభినందించారు. శివానందస్వామి 300కు పైగా పుస్తకాలను రచించిన మన సంస్కృతి సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసిన మహనీయుని ఆశ్రమంలో ఈ పుస్తకావిష్కరణ జరగడం విశేషమని ఆయన అన్నారు. మన శక్తులన్నింటికి ఆధ్యాత్మిక శక్తి తోడుగా ఉండాలని కసిరెడ్డి పేర్కొన్నారు. ఆధ్యాత్మిక ప్రసంగాలు గావిస్తు, ఆధ్యాత్మిక రచనలు చేస్తున్న ఆచార్య మసన చెన్నప్ప దేశంలో జరుగుతున్న అన్యాయాలపై రాజకీయ కుట్రలపై, ప్రజా సమస్యలపై తన కవిత్వంలో స్పష్టం చేశారని నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు అభినందించారు. దేశభక్తిని రగిలించే కవిత్వాన్ని చెన్నప్ప వెలువరించారని గూడూరు మహేందర్ రెడ్డి అభినందించారు. శివానందాశ్రమంలో జరిగిన ఈ సభలో శంకరనారాయణ, వామరాజు సత్యమూర్తి, సీహెచ్ లక్ష్మీనారాయణ, డా॥ వెంకటేశ్వర రాజు, డా॥ కస్తూరి లక్ష్మీనారాయణ, పబ్బోజు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కవయిత్రి రావూరి వనజకు'ప్రమీలా శక్తిపీఠం విశిష్ట సాహిత్య పురస్కారం 2023' ప్రదానం చేసారు. వనజకు రూ. 10వేల నగదు పురస్కారాన్ని అందించి ఘనంగా సత్కరించారు.



రావూరి వనజకు "ప్రమీలా శక్తిపీఠం విశిష్ట పురస్కారం' ప్రదానం చేస్తున్న అతిథులు బైస దేవదాసు, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య మసన చెన్నప్ప, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు.

## 'రేపటి మైదానం' ఆవిష్కరణ







పుస్తకావిష్కరణలో అతిథులు ఎస్.రఘు, సూర్యా ధనంజయ్, రాచపాళెం చంద్రశేఖర్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్, డా॥ ఎన్. గోపి, వోలేటి పారవ్తఈశం, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, మద్దాళి రఘురాం తదితరులు.

హైదరాబాద్, జూన్ 26 :తంగేడు పువ్వంత నిరాడంబరత్వం, సరళత్వం కలగలుపే ప్రముఖ కవి ఆచార్య ఎన్.గోపి అని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ అభివర్ణించారు. సామాన్యుల మనసును సైతం స్పృశించేలా కవిత్వం రాయడం ఆయన ప్రత్యేకత అని అన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో మంగళవారం నాంపల్లిలోని తెలుగు వర్సిటీ సభా మందిరంలో ఆచార్య ఎన్.గోపి 75వ పుట్టిన రోజు సందర్భంగా ఆయన రాసిన 75 కవితల సంపుటి 'రేపటి మైదానం' పుస్తకాన్ని కె. శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని ప్రఖ్యాత విమర్శకుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డికి అంకితం ఇచ్చారు.

ప్రజ్వలింప చేసేందుకు ఆయన ప్రయత్నించారని ప్రశంసించారు. సభాధ్యక్షత వహించిన వోలేటి పార్వతీశం మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయం వీసీగా, కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్‌గా గతంలో ఆయన అందించిన సేవలను గుర్తు చేశారు. తెలుగు కవిత్వ చరిత్రపుటలో ప్రత్యేక అధ్యాయం ఎన్.గోపి అంటూ ఓయూ తెలుగుశాఖ ప్రొఫెసర్ సూర్యధనుంజయ్ కొనియాడారు. కవి పుప్పాల శ్రీరామ్ గ్రంథ సమాలోచనం చేశారు. కవిత్వ రచనే జీవన ప్రయాణంగా మార్చుకున్న కవితా బాటసారని ఆయన సాహిత్య జీవితాన్ని ప్రముఖ విమర్శకుడు ఎస్.రఘు తన ప్రసంగంతో ఆవిష్కరించే ప్రయత్నం చేశారు.



ఎన్.గోపిని సత్కరిస్తున్న అతిథులు.

అనంతరం కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గోపి కవిత్వం మనసుకు హాయి కలిగిస్తుందని అన్నారు. మనల్ని మానవీకరించగల శక్తి సైతం ఆయన కవిత్వానికి ఉందని కొనియాడారు. ఉద్యమాల కవిగా లేకపోయినా, ఆ భావాలన్నీ ఆయన కవిత్వంలో స్పష్టంగా కనిపిస్తాయని అన్నారు.

కృతి స్వీకర్త ఆచార్య రాచపాళెం మాట్లాడుతూ ప్రజాకవి వేమనను విశ్వ విద్యాలయాల మెట్టు ఎక్కించిన ఘనత గోపి సొంతమని శ్లాఘించారు. ఐదు వందల వేమన పద్యాలకు వ్యాఖ్యానం రాశారని, తద్వారా ఆ ప్రజా కవి స్ఫూర్తిని తరతరాలకూ

ప్రముఖ పరిశోధకుడు సుంకిరెడ్డి నారాయణరెడ్డి, రచయిత డా॥ జతిన్‌కుమార్, సిటీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ నీరజ, ప్రముఖ రచయిత వంగల హర్షవర్ధన్, యువకవి కుడికాల వంశీధర్ తదితరులంతా ఆచార్య ఎన్.గోపి కవిత్వం మీద ప్రసంగించారు.

ఇంతమంది ప్రేమాభిమానాలు పొందడం తనకు దక్కిన అద్భుతమైన అవకాశమని ఆచార్య ఎన్.గోపి ఆనందం వ్యక్తం చేశారు. తన మీద గౌరవంతో సభను నిర్వహించిన కిన్నెర ఆర్ట్ థియేటర్ కార్యదర్శి మద్దాళి రఘురాంనకు సభాముఖంగా ధన్యవాదాలు తెలిపారు.

## కన్నీటి తడి

గాలి ఎటు వీస్తుందో
పూలు
రాలుతున్నాయి
చినుకు రాలింది
చిన్నగా.

నేల దప్పిక తీరలేదు
కాలాన్ని కన్నీటి చుక్క
కరగదీస్తున్నది.

సామాన్యుని దారి మొత్తం
కన్నీటి ధార
కడుపు
ఆకలి తీర్చని
బతుకు వ్యధ.

కలల ప్రతి అడుగు
ధ్వంస మవుతున్న వేళ
ఆకాశం విషాదాన్ని నింపుకుంది
చంద్రుడు చీకటిలో
కనుమరుగయ్యాడు.

నేలను దుఃఖం చుట్టుకుంది
బతుకు అమావాస్య
రాత్రయ్యింది
నేలను నమ్ముకున్నాను
దుఃఖం మిగిలింది.

కలలు కన్నీరు కార్పిస్తున్నాయి
ఎన్నాళ్లు దుఃఖం
జీవిత ప్రశ్నకు
ఎవరూ సమాధానమివ్వరు
కరుణలేని సమాజంలో
కన్నీటి ధారల మధ్య
తోడురాని వెలుగులో
ఎన్ని మైళ్ళు దాటినా
వెలుగు కనిపించదు
వెన్నెల వికసించదు.

శ్రమను నమ్ముకున్నాను
నేల దప్పిక తీరలేదు
కన్నీటి ధార నా నేస్తం
జీవితాన ఎప్పుడూ వీడలేదు

కన్నీళ్లకు కూడా
అర్థం ఉండంటారు
నా జీవితాన
అర్థం కాని కన్నీళ్లు ఎన్నో
నేను శ్రమజీవిని.

నా కన్నీరే సూర్యాస్తమయం
నా బాధల గాథలే ఒక్కొక్క
సూర్యోదయం

–సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

## అక్షరాలు

అక్షరాలు
తోడై
వెంటనడుస్తున్నాయి
అక్షరాలు
దివ్వెలై
వెలుగులుచిమ్ముతున్నాయి.
అక్షరాలు
పువ్వులై
పరిమళాలువెదజల్లుతున్నాయి.
అక్షరాలు
నవ్వులై
మోములనువెలిగిస్తున్నాయి
అక్షరాలు
చినుకులై
వర్షిస్తున్నాయి.
అక్షరాలు
పలుకులై
తేనెచుక్కలనుచల్లుతున్నాయి.
అక్షరాలు
మిఠాయిలై
తీపినితినిపిస్తున్నాయి.
అక్షరాలు
జాబిలై
వెన్నెలనుకురిపిస్తున్నాయి.
అక్షరాలు
తారకలై
తళుకుతళుకుమంటున్నాయి.
అక్షరాలు
అమృతచుక్కలై
అధరాలనుక్రోలమంటున్నాయి.
అక్షరాలు
సత్యాలై
వాస్తవాలనుచూపుతున్నాయి.
అక్షరాలు
తీగలై
ప్రాకుతున్నాయి
అక్షరాలు
మొక్కలై
కాయలుకాస్తున్నాయి.
అక్షరాలు
ముత్యాలై
సరాలుగాగుచ్చమంటున్నాయి
అక్షరాలు
ఆలోచనలకురూపమై
కవితలవుతున్నాయి
అక్షరాలు
భావాలై
మనసునుహత్తుకుంటున్నాయి
అక్షరాలు
పుటలకెక్కి
పుస్తకాలవుతున్నాయి
అక్షరాలు నాకుతోడు
నేను అక్షరాలకుతోడు
మేము కలసిముందుకునడుస్తాము.



–గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్
సెల్: 7981616630

## ఏడుకోలల బాయి

వీధికొచ్చెడి నేతకెదురెల్లి అడగాలి
కుల కార్డు లేకుండ గెలువుమంటు
కులమేది లేకుండ నిలబెట్టు ఆశయం
ఉన్నదా లేదంటు ఉతకవలెను
అడుగు వర్గము సంఖ్య కనుగుణంబుగ సీట్లు
అసలెందుకివ్వరో అడగవలెను
అన్ని పార్టీలలో అట్లాంటి కథలుండు
మూలంబదేమిటో తేల్చవలెను.
లోతులోబడిన కులాల ఖ్యాతికూడ
వెలికి తీయాలి చరితను వెదికివెదికి
నేటి జనరంగమని చెప్పు ఆటలోన
మార్పు కోరిన వాడెపో మార్చగలడు

మాయమాటల హామీల మర్మమెరిగి
గుర్తులేకుండ ఓటెట్ల గుద్దుతావు
ఓరి వెంకన్న! దోస్తుగా ఒర్లుబోతు!
ఒక్కమాటన్న వినవార! తిక్కలోడ!



–డా॥ఏనుగు నరసింహారెడ్డి
8978869183

## నవ షట్పదులు

మైకు చేతికందితే నేతలు
వల్లిస్తారెన్నో ఆదర్శాలు!
ఆచరణలో చూపుమంటేనే
లెక్కిస్తారు మీనమేషాలు!
అవినీతులు బట్టబయలైనా
దొరల కనువుగా దొంగవేషాలు!

రాజకీయంలో రాణించేది
రాజసంగా ఆ నలుగురే!
సినీ రంగంలో శాసించేది
"మనీలాండరింగు"తో ఆ నలుగురే!
సాహిత్య రంగంలోనూ సాధించేది
చాటుమాటుగా ఆ నలుగురే!



– డా॥వద్దేపల్లి కృష్ణ
సెల్: 9246541699

## పుస్తక సమీక్ష

## సముద్రమంత ప్రేమ

హన్మాండ్ల రవీందర్ మంచి కవి. సమాజం పట్ల సీరియస్ నెస్ ఉన్న కవి. తన జీవితంలో ఎక్కువ కాలాన్ని అనేక రకాల ప్రజాఉద్యమాల కోసం ఖర్చు చేసిన వాడు. స్పష్టమైన సామాజిక దృక్పథం కల్గిన వాడు. సమాజం గురించి నిబద్ధతతో కవిత్వం రాసే రవీందర్ గారికి ఆ కవిత్వాన్ని పుస్తకంగా తేవాలనే నిబద్ధత మాత్రం లేదు. నా లాంటి వాళ్లు పుస్తకం వేయమని ఒత్తిడి చేసినా నవ్వుతూ ప్రయత్నం చేద్దామని చెప్పి తప్పించుకునేవాడు. గట్టిగా అడిగితే నాకు బద్ధకం ఎక్కువ అని నిజం కూడా చెప్పేవాడు. అలాంటి రవీందర్ ఇప్పుడొక పుస్తకం వేసాడు. దాని పేరు "సముద్రమంత మనుషులు". రవీందర్ తన అమ్మానాన్నలతో బాటు విప్లవోద్యమకారుడైన తన తమ్ముని యాదిలో వేసిన పుస్తకం ఇది. ఎప్పుడో చనిపోయిన తమ్ముణ్ని, నాన్నను అదేవిధంగా అమ్మను తలచుకుంటూ ఆమె చనిపోయిన పదిరోజులకు సభ పెట్టి పుస్తకాన్ని ఆవిష్కరించాడు రవీందర్. తన కవిత్వం పుస్తకంగా తేవటానికి బద్ధకించిన రవీందర్ ఈ పుస్తకం విషయంలో మాత్రం ఏమాత్రం అలసత్వం వహించలేకపోయాడు. దానిక్కారణం వాళ్ళతో రవీందర్ కున్నది రక్త సంబంధం మాత్రమే కాదు. అంతకు మించి . ఈసమాజానికి ఏదో చేయాలనే తపన వీళ్ళందరిలోనూ ఉన్న కామన్ క్వాలిటీ .





ప్రతులకు: హన్మాండ్ల రవీందర్ మందమర్రి, మంచిర్యాల జిల్లా సెల్:9912233533

ఈ ముగ్గురి జీవితాల గురించి తెలిసిన వాళ్ళకెవరికైనా ఈ పుస్తకం పేరులోని సామంజస్యం బోధపడుతుంది. కొత్తవాళ్ళకు కూడా ఈ పుస్తకం మొత్తం చదివితే అర్థమవు తుంది. సముద్రమంత గాంభీర్యం ఉన్న మనుషులు వాళ్ళు. ఈ సమాజం మీద సముద్రమంత ప్రేమ గలవాళ్ళు."ఈ ప్రజల కోసం పోరాటం చేయటానికి విప్లవోద్యమం లోకి వెళ్తామని నిర్ణయించుకున్న హన్మాండ్ల సత్యనారాయణ అమ్మకు చెప్తే తల్లి మనసు విలవిలలాడింది. ఈ నిర్ణయం పట్ల మౌనం వహించిన భర్తను నిలదీస్తే–వాడు చెప్పింది వింటే ఎట్లా ఆపల్నో అర్థమయితలేదే అన్నాడట తండ్రి". ప్రజల విముక్తి పోరాటంలో తన ప్రాణాలని సైతం లెక్కచేయని కొడుకు ఔన్నత్యాన్ని గుర్తించటం, తనకు మద్దతు తెలపటం అంటే మామూలు విషయం కాదు. అందుకే వాళ్ళను సముద్రమంత మనుషులు అన్నాడు రవీందర్. అందుకే వాళ్ల జ్ఞాపకాలను పుస్తకం చేసాడు.

సమాజం పట్ల ఈ ముగ్గురిలో ఉన్న ఎనలేని ప్రేమ వీళ్ళను ప్రత్యేకమైన వ్యక్తులుగా నిలబెట్టింది. సత్యనారాయణ అంటే హైదరాబాద్ నగరంలో చదువుతూ అక్కడి పోరాటాల్లో భాగమై తర్వాత రోజుల్లో పూర్తి కాలం విప్లవోద్యమంలో పనిచేసాడు. రామయ్య గారు ఐదవ తరగతి దాకా చదివినవారు. ఈశ్వరమ్మ అయితే నిరక్షరాస్యురాలు. అయినా వీళ్లంతా సమాజాన్ని సక్రమంగా అవగాహన చేసుకున్నారు. సమాజంలో దోపిడీ ఉందని, దాని కోసం ఎవరోఒకరు పోరాటం చేయక తప్పదనే సత్యాన్ని అర్థం చేసుకున్నారు. అందుకే కొడుకు నిర్ణయానికి అడ్డు చెప్పలేదు. సత్యమైనా, ఆయన తల్లిదండ్రులయినా ఎంతటి త్యాగశీలులు.

రవీందర్ తమ్ముడు సత్యనారాయణ గొప్ప సృజనకారుడు. ఆయన కవిత్వం రాసాడు. సాహిత్య విమర్శ చేసాడు. కథలు రాసాడు. ఆయన మరణాంతరం "పునరంకితం"పేరుతో ఆయన సాహిత్యం విరసం ప్రచురణలో భాగంగా వచ్చింది. ఈ సాహిత్యం రావటానికి గల కారణాలను గురించి, ఆ చరిత్ర గురించి ప్రస్తావిస్తూ వివరమైన ముందుమాటలు రాసారు వరవరరావు, శివారెడ్డి . సత్యం సాహిత్యం చదువుతుంటే అంత చిన్న వయసులో అంత విస్తృతమైన జ్ఞానాన్ని ఎలా సంపాదించాడోనని ఆశ్చర్యం వేస్తుంది. సాహిత్యం గురించి, చరిత్ర గురించి, రాజకీయాల గురించి ప్రజల కోణంలో ఆయన చేసిన విశ్లేషణలు మనకు కొత్త పాఠాలు నేర్పుతాయి. ఆయన కవిత్వం గురించి రాయాల ంటే మరో పుస్తకం అవుతుంది. విప్లవోద్యమానికి కవిత్వానికి గల సంబంధం గురించి మనం ఊహించని నిజాలు చెప్తాడు సత్యం.

**"ఇక్కడ**
**అక్షరానికి జీవం పోయటం అనివార్యం**
**అక్షరాన్ని సాయుధం చేయటం అనివార్యం**
**తనని తాను పిండుకుని**
**జీర్ణించుకుని, నిగ్గు దేల్చుకుని,**
**మొగ్గ చూసుకుని**
**ఒక్కొక్కరు ఒక్కో అక్షరమయ్యారు**
**అక్షరాన్ని ఆపోసన పడుతున్నారు**
**ఇప్పుడు వారి రక్తంలో**
**ఎర్ర తెల్ల కణాలే కాదు**
**అక్షర కణాలు కదులుతున్నాయి"**

అంటాడు. బహుశా విప్లవమూర్తులకు ఆహారంలాంటిది కవిత్వం. వాళ్ళ ఆచరణకు ఊపిరి లాంటిది కవిత్వం. కవిత్వాన్ని ఇంత ప్రేమిస్తారా వాళ్ళు అని మనకు ఆశ్చర్యం వేస్తుంది ఇట్లాంటి వాక్యాలు చదివితే. కవిగా సత్యం ఎంత ఎత్తున ఉంటాడో విమర్శకునిగా అంతే ఎత్తులో నిలబడ్డాడు. ఆయన రాసిన ప్రతీ వాక్యం ఆయన రక్తంతో రాసినట్టు ఉంటుంది. ఆయన చేసిన ప్రతీ ఊహ ఆయన ఊపిరితో నేసినట్టు ఉంటుంది. అంతటి సాహిత్య ప్రేమికుడు సత్యం. అయితే సత్యం తన నిబద్ధతను విప్లవోద్యమంలోనే కాదు సాహిత్య విప్లవోద్యమంలోనూ స్పష్టంగా ప్రకటించినవాడు సత్యనారాయణ. ఈ రకంగా సత్యం ఎందరికో ఆదర్శంగా నిలిచాడు. అందుకే ఈ ఆదర్శమూర్తులను ప్రపంచానికి మరోసారి పరిచయం చేయటానికి రవీందర్ చేసిన మంచి ప్రయత్నం ఈ పుస్తకం. ఈ పుస్తకంలో ఎన్వీయార్, ఫాలాంక్స్, నోవా ల పేరుతో ఉన్న వ్యాసాలతో పాటు రవీందర్ రాసిన వ్యాసాలు కవితలు ఉన్నాయి. రవీందర్ చేసిన అక్షర చిత్రణలో ఈ ముగ్గురు మనుషులూ సముద్రమంత మనుషులన్న సంగతి స్పష్టమవుతుంది. సమాజం మీది ప్రేమనే వాళ్ళను సముద్రమంతటి మనుషులను చేసింది. వాళ్ల మీద రవీందర్ కు సముద్రమంత ప్రేమ ఉండటం వల్లనే ఈ పుస్తకం వచ్చింది. వ్యక్తివాదం ప్రబలుతున్న ఈనాటి సమాజానికి ఇట్లాంటి పుస్తకాల అవసరం ఎంతో ఉంది.



–తోకల రాజేశం
967676141

## నీటి బుగ్గల్లో దాగున్న జీవన శాస్త్రం



–మహాకవి డా॥ కత్తి పద్మారావు
9849741695

ఢిల్లీ నగరం దాహార్తి లో ఉంది
అంతరంగాలూ అలజడిలోనే ఉన్నాయి
భూగర్భ జలాలే కాదు,
గుండెల్లో తడి కూడా ఆవిరవుతుంది
కక్ష నాలుగు కాళ్లతో నడుస్తుంది!
విధ్వంసం ఒక దినచర్య అయింది!!
'వారు నిర్మించండి' అనే కేక లోనే
విధ్వంసం ఉంది
నాగలి కొర్రును చేయడానికి
ఆ శిల్పి చేతికి రంధ్రాలయ్యాయి
విశాలమైన నేలను
సాగు చేసింది ఆ నాగలే
దాని చెక్కను చెక్కిన వడ్రంగికి,
ఆ కొర్రును కాల్చిన కంసాలికి
జానెడు నేల లేదు!
నిజమే! నదీ ప్రవాహంలోని నీటిబుగ్గను
ఒక కుండలోకి నింపాకేగా
త్రాగునీరు అనే రూపం వచ్చింది
నదులను మురికి చేసే ఆచారం
జీవధారను విషయుక్తం
చేసే చర్యేగా!
ఆ సింధూ నగరాల్లో మెరిసిన
ఆ కుండలో సంస్కృతీ వికాసం ఉంది
మనిషికి త్రాగడానికి నీరు లేదు
ఆ నల్లని శిలలకు నెయ్యి
చిప్పల్లో పోసి అందిస్తున్నారు!
నేతిబొట్టును ఆ శిలలు ఆస్వాదిస్తాయా ?
పసిపిల్లలు పురిటిలోనే గతిస్తున్నారు
ఆ తల్లి గర్భవతి అయినప్పుడు
ఒక్కసారైనా నెయ్యి కలిపిన
అన్నం తిందా?!
ఆ కుండను ధ్వంసం చేసి
ప్లాస్టిక్ తెచ్చారు
క్యాన్సర్ కొని తెచ్చుకున్నారు
కడుపులో వ్రణాలకు
కారణం ఏమిటి?
దురాచారాలు కాదా?!
ప్రకృతి వనరుల విధ్వంసం కాదా?!
ఆ బొందు మల్లె
ఎన్నో రేఖలతో వికసించింది
ఆ చెట్టుకు నీటి ధార అందించే
ఆ పడతి కళ్ళు మెరిశాయి
ఒక మొక్కకు నీటి చుక్కను అందించలేని
ఆ ఊబకాయుల
ముఖంలో వర్చస్సు లేదు
కుండలో నీరు మోసుకొచ్చాక
ఆ గిరిజన పడతి
ముఖానికి చల్లుకున్న దోసెడు జలం
నక్షత్ర మండలి శోభను తెచ్చింది
కొన్ని మోములు
వికాసవంతంగా ఉంటాయి
తరగలలో
సూర్యకిరణాలలో వచ్చే మెరుపు
వారిలో కనిపిస్తుంది
ఆ తోట లోకి
అడుగు పెట్టిన వెంటనే
ఔషధ పత్రాల సువాసనలు
శ్వాసకు స్వచ్ఛతను తెస్తున్నాయి
ఆ వనిత ఆ దోర మామిడికాయలు కోస్తూ
చెట్టు కొమ్మలు వంచింది
లేత పచ్చ రంగు తనను పెనవేసుకుంది
ఆ పెదాల్లో గులాబీలు పూసాయి
సృష్టితో అనుబంధం లేని వారు
నిరాశక్తులు కదా!
బుల్లితెరల్లోకి తలలు దూర్చి
వైరుధ్యాల విష కౌగిలిలో
విషణ్ణవదనులు అవుతున్నారు కదా!
వారు విశాలమైన భవనాలు కట్టుకుంటున్నారు
చుట్టూ మొక్కల సందడి లేదు
విత్తనాలు–చెట్లు–ఆకులు–పిందెలు–కాయలు,
ఉదయాలు – సాయంత్రాలు,
చీకటి – వెన్నెల
ఇవన్నీ వారు మరిచిపోయారు
ఇళ్లలోనే థియేటర్లు అమర్చుకొని
బార్ రూములు, వార్ రూములు ఏర్పరుచుకుని
నగ్న, అర్ధనగ్న ప్రదర్శనలు చూస్తూ
ఎందుకు వీరు మెదడులో
చెత్త పేర్చుకుంటున్నారు?!
నిద్రలేమితో, పీక్కుపోయిన కళ్ళతో
ఉదయాన్ని త్యజిస్తున్నారు?!
ఏది నివాసం? ఏది ఆవాసం?
ప్రకృతేతరమైనదంతా
కృత్రిమ విన్యాసమేగా!
ఆ గోదావరి నదిలోకి వెళ్ళిన
పడవ అంచులపై కూర్చున్న సుదతి
అలల సంగీతంతో శృతి కలుపుతుంది
కొప్పులోని బంతి పువ్వు జారి
నదిపై నవ్వడం చూసి
ఆమె మురిసింది
ఎందుకు మీరు కల్పిత గాథలు విని
చెవులకు చిల్లులు చేసుకుంటున్నారు?
మోహినీ భస్మాసుర ఘట్టాన్ని
భాగవతుల నృత్యంలో చూసి
మురిసిపోతున్నారా?
కల్పించబడిన కథలకే
బుర్రలు తాకట్టు పెడుతున్నారా?
అటు చూడండి!
ప్రపంచ అవనిక మీద ఏక సూత్రంగా
నిలబడిన బౌద్ధ స్తూపాలు
కాశ్మీరం ఒకనాటి బౌద్ధ క్షేత్రమేనని
ఎలుగెత్తి చాటుతున్నాయి
విశ్వజనీన భావనతో
మానవతా గానాన్ని ఆలపిస్తున్నాయి
రాజ్యం వదిలేశాకేగా తథాగతుడు
ప్రపంచమంతా విస్తరించింది
జీవహింసను నిరాకరించాకేగా
మహావీరుడు జైనుడు అయ్యింది
"అహింసా పరమో ధర్మః" అన్నవాడేగా
ప్రవక్త అయ్యింది
నియంతలు కనుమరుగవుతున్నారు
మహా బోధకులు
యుగ కర్తలవుతున్నారు
ఏది నిరాకరింపబడుతుందో
దానిలో శాస్త్రం ఉంది
జీవ శాస్త్రానికి మూలం
ప్రకృతి జీవన ధర్మం.
జీవితం – ప్రకృతి – సంఘం
సమన్వయమే ధమ్మ పదం
ఆ మార్గంలో నడుద్దాం.



సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో టీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలియజేస్తున్న రాష్ట్ర చిన్న పత్రికల ప్రతినిధులు అశోక్, యూసుఫ్‌బాబు, ఆజాంఖాన్ తదితరులు

# అమ్మను పారేసుకోకు

అమ్మంటే అమ్మే..
అమ్మకి మరో ప్రత్యామ్నాయం లేదు
అమ్మకి సాటి వచ్చేది
ఈ లోకంలోనే లేదు
ఉన్నంత కాలం మనతో వుంటుందా
ఉన్నప్పుడే బాగా చూసుకోవాలి
తల్లికి
పిల్లలు ఒక్కరే వున్నా ఎందరున్నా
అందరికీ సమానంగా వరాలిచ్చే దేవత
అమ్మకాక మరెవరున్నారు ఇలలో
గోడమీద
దండేసే ఫోటోగా మారాక
ఎన్ని కన్నీటి చుక్కలు రాల్చినా
అవి వేడి భూమ్మీద పడిన
కన్నీటి చుక్కలే

అమ్మను గౌరవిద్దాం
అమ్మను ప్రేమిద్దాం
అమ్మను ఆదుకుందాం
అమ్మను
ఆమె వున్నప్పుడే ఆదరిద్దాం
ఆమె త్యాగాల్ని గుర్తిద్దాం
శ్లాఘిద్దాం ఆమె సేవల్ని
పారేసుకుంటే మరో వజ్రం దొరకొచ్చు
సంపదలు సమకూరొచ్చు
అమ్మ దొరకదు- అందుకని
అమ్మను పారేసుకోకు.



-మాధవి సనారా
సెల్: 8639491246

# అమర వైతాళికుడా..!

వెన్ను పోటుకన్న
గుండెపోటు మిన్న.

గుండె పోటు మరణం
సమర స్వర స్మృతి
తెలంగాణం సజీవ చలనం
యాభై ఏడు ఏళ్ల జీవన యుద్ధగీతం

సువరం ప్రతాప ధీరుడా..!
పాలమూరు మాగాణం వరపుత్రుడా..!
అక్షర పతాక శిఖరాగ్రుడా..!
అమర వైతాళికుడా..
తెలంగాణ విముక్తి యోధుడా..!!
జోహార్లు కవి జోహార్లు.



- జనజ్వాల
సెల్: 9949163770

# నైజం

పెళ్ళికి,
కారు వచ్చింది
స్వాగతాలు ఎదురెళ్ళాయి,
బైకు వచ్చింది
భుజం మీద చేయి తోడై నడిచింది,
ఆటో వచ్చింది

దూరం
నవ్వే పలకరించింది,
నడక, వచ్చింది..
కలువని చూపులు
ఒంటరికుర్చీలనే మిగిల్చింది,
అంతమందిలో నా కళ్ళు
మనిషికై
వెదుకుతున్నాయి!!



- డా.కాసర్ల నరేశ్ రావు
9441406252

పుస్తక సమీక్షలు

# చిత్ర కవితా శతకము




ప్రతులకు: జక్కని గంగాధర్
225/025, యశస్వి సి.హెచ్.యస్
గోరాయ్, బోర్‌విల్లీ వెస్ట్
బొంబాయి-500 092.

జక్కని గంగాధర్ గారి ముచ్చటైన మూడో పుస్తకం చిత్ర కవితా శతకము. 110 శతక పద్యాలను తాను ఎంచుకున్న బొమ్మలకు తనదైన ధోరణిలో ఎంతో అర్థవంతంగా రాసి అందించారు. బొమ్మలను ఎన్నుకోవడం ఒక ఎత్తు అయితే వాటికి విలక్షణంగా ఒక గుండెలకు హత్తుకునే భావాన్ని సమకూర్చడం మరొక ఎత్తు. నాలుగవ చిత్రంలో రోడ్డు ప్రక్కన కూర్చున్న పేదరాలు. ఆమె కన్నీటిని తుడుస్తున్న ఒక బాలుడు. ఈ చిత్రానికి గంగాధర్‌గారి ఆటవెలది చదివితే ఎంతో భావనాత్మకంగా అనిపించింది. తల్లి యేడ్చె ననియు తనయుడు ఏ తెంచి కంట తడిని తుడిచి వెంటనడిచె, అమ్మ ఏడ్వవలదు, కష్టాల మనలను కనికరించు ననియు కళ్ళనద్దె, ఈ విధంగానే 24వ చిత్రంలో ఆడపిల్ల రిక్షాలాగుతూ వుంటుంది. ఆడపిల్ల జూడు సతి బాధ్యత కలిగి బండి నడుపు చుండె బలముగాను, విస్తుపోయి జూసి మస్తుగా మెచ్చిరే చిన్నదాన్ని జూసె చిత్రముగను అన్ని మాటలు గుండెలు పిండేస్తాయి. అలాగే నీటి కొరత, బాల కార్మికులు, అనాధ బాలలు, మాటతీరు, దానధర్మాలు, కులమతాలు, పచ్చదనము, తల్లిదండ్రులు, ధూమపానం, నవ్వు, కష్టము-కన్నవారు, రైతు, కాలము, మాతృమూర్తి, అత్తా కోడళ్ళు, వంటి చిత్రాలకు వీరి వివరణ బాగుంది. ముఖ్యంగా, పట్టణాల్లో డ్రైనేజ్ పైపుల్లో కాపురముంటూ పిల్లను బడికి పంపుతున్న తల్లి మనోగతాన్ని అక్షరీకరించిన తీరు ప్రశంసనీయం. ఒక మేక మీద చెరొక వైపు ముందు క ఆళ్లుంచి చెట్టు ఆకులు అందుకుంటున్న రెండు మేకల చిత్రానికి, కలిసి వుంటే కలదు సుఖంగా రాసిన పలుకులు చదివేందుకు ఇంపుగా వున్నాయి. ఇక శివుడూ , కృష్ణుడూ, కుచేలుడూ, యశోదా కృష్ణుడు, అయ్యప్ప, హనుమ చిత్రాలకు జక్కని పద్యాలు చక్కగా వున్నాయి. కవి ఆశించినట్లుగా గంగాధర్ ప్రయత్నం సఫలీకృతం అయిందనే చెప్పుకోవాలి. సామాజిక స్పృహ కలిగి రాసే జక్కని వంటి కవులు అవసరం ఈ సమాజానికి ఎంతైనా వుంది.



- డా॥ పులివర్తి కృష్ణమూర్తి,
సెల్: 99490 92761

# వివిధ

దయలేకుంటే
మనిషినెలా గుర్తిస్తావు
దయాగుణమే
మనిషికి మూలవేరు.

విద్యార్థులు
నిరంతర సాధకులు
అధ్యాపకులు
జ్ఞానప్రదాతలు.

ఆధునిక మహిళ
అబలకాదు సబల
అణచివేత పై
యుద్ధం ప్రకటించింది.
చేతికి కొడవళ్ళు
మొలిచాయి
చేష్టలుడిగినవాళ్ళు
చరిత్ర సృష్టించనున్నారు.

స్వీట్ హైదరాబాద్
షడ్రుచులలో తీపిని
తీసేద్దాం
అదే రేపు మనకు.
మరణశాసనం.

బాధ
పడొద్దనలేదు
బాధల బంగాళాఖాతంలో
మునగొద్దంటున్నా

రాయిని
ఈసడించకండి
తొక్కితే అది మెట్టు
మొక్కితే
అది దైవం

బ్రతుకంటే
కాలక్షేపంకాదు
కాలం వినియోగం
గెలుపుకు ఆహ్వానం

-అంకాల సోమయ్య
9640748497

# వైవిధ్యం

ఇంకా గీ జిద్దేంది జెప్పు
సెవులినవత్తలేవు...కండ్లు గనవత్తలేవు
షరారత్ కు వొయ్యి ఏం సాధిస్తవు.
మన్సిచ్చి మాట్లాడినప్పుడే
ప్రేమకు తొవ్వలు వుంటయి గాదు.
కదరుండాలె... కనికరమూ ఉండాలే..
కక్కసం మాటలు యోలు మోయ్యాలే
కుదెం లేకుంట బతుకుతున్నప్పుడు
గీ కుతకుత ఉడుకుడేంది...?
బియ్యమన్నంక నూకలు ఉండయా..
తొవ్వ అన్నప్పుడు ముండ్లుండయా..
అరొక్కదానికి ఆగమైతె ఎట్ల జెప్పు?
ఏరేసుకుంటం గాని...
ఏరు ముచ్చటెంది.
కలివిడితనం వుండాలే గాని
గీ కన్నెర్రతనం ఎందుకు..
పేరేల్లినంక ప్రేమలు జంపుకోవద్దు.
మనిషున్నంత కాలం మనసును
జంపుకోవద్దు!
కాలాన్ని జల్లించిన వాళ్ళే...
అనుభవాల ముల్లలే ...
ఓపిక వద్దేనే గదా ఏదన్న
ముంగట్కచ్చేది..
ఆమరతానికి వొయ్యి అడ్డంబడితే
ఉన్న ఆసరా శేతులకెల్లి జారిపోతది..!
అన్ని దినాలు ఒక్కతీరు ఉంటయా.
బతుకు పుస్తకం లోని
అనుభవాల ప్రతి పేజీ విలువైనదే...
గౌరవించాల్సిందే...!
వెనుకటిలానే ఉండాలనే
మంకుతనం మంచిది కాదు -
కాలాలు మారుతుంటయి..
మనుషులం మారుతుంటం..
మనుషుల తత్వాలూ మారుతుంటయి.
తాత మనుమడి జీవనం
ఒక్కతీరు ఉండదుగాక ఉండదు -!!



-మోతుకూరి అశోక్ కుమార్
9247380976

# పోరాటయోధుడు

జీవనది కృష్ణమ్మ ఒడిలో
జన్మించిన ఆదర్శం,
ఆటుపోట్లను తట్టుకునే గుండెధైర్యం...
"అన్నదాత" ఋణం తీర్చుకున్న
అపర బాంధవుడు
అక్షర ప్రవాహానికి కొత్త వరవడి
సృష్టించిన ఆధునిక మయుడు...
బుల్లితెరను విశ్వవ్యాప్తం చేసి
వినోదాన్నందించిన విబుధ స్రష్ట,
వ్యాపార సంస్కారం నేర్పి లక్షలమందికి
ఉపాధి నందించిన సిరి ప్రియుడు...
ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే దృష్టి,
నిండైన వ్యక్తిత్వానికి
నిలువెత్తు సృష్టి...
ఉన్నతికి కొలమానండబ్బే కాదని
సామాజిక సేవా కాంతి
ద్వారాలు తెరచిన గొప్ప మనీషి...
అమ్మ వడిలో నేర్చిన
విలువలకు అంకితమయిన
మానవతామూర్తి,
అలుపెరుగని పోరాట స్ఫూర్తి,
అంచెలంచెలుగా ఎదిగిన
నేటితరానికి మార్గదర్శి
రామోజిరావుకు అక్షర నివాళి.



-డా.మైలవరపు లలితకుమారి
9959510422



# భారతదేశంలో స్త్రీలు-వితంతు వ్యవస్థ

కుటుంబ శాంతి, సమాజ శాంతి ఉన్న దేశం సుఖ సంతోషాలతో అభివృద్ధి పథంలో పురోగమిస్తుంది. కానీ మన ఆధునిక మానవ సమాజం దౌర్భాగ్యం ఏమిటంటే ప్రతిరోజూ Violence and Crime పెరిగిపోతుండటం. ఒక జాతిని మరొక జాతీ, ఒక వ్యక్తిని మరొక వ్యక్తీ, ఒక దేశాన్ని మరొక దేశం, పీడిస్తూ, శాంతి సూత్రాలను, మానవ హక్కులను దారుణంగా ఉల్లంఘిస్తూ, సంక్షోభంలోకి పడిపోతున్న విషాదకర పరిస్థితుల్లో Global Village గురించి మాట్లాడుతూ గొప్పలు చెప్పుకుంటున్నాం.

మానవ జాతిలో సగ భాగంగా ఉన్న మహిళా జనం, సృష్టికి పునః సృష్టి చేసే స్త్రీ మూర్తులను ఒకవైపు దేవతలూ కనిపించే ప్రత్యక్ష దైవాలు అంటూనే ఆ దేవతలపై అమానుషంగా అఘాయిత్యాలు, అత్యాచారాలకూ పాల్పడుతున్నారు. కొన్ని దశాబ్దాల చరిత్రను చూస్తే కొన్ని కోట్లమంది స్త్రీలు మాయమైపోయిన (Missing Women) వాస్తవం కనిపిస్తుంది. స్త్రీ-పురుషుల, బాల-బాలికల నిష్పత్తిలో సమాజం ఎంత అసమతుల్యంగా ఉందో తెలుస్తుంది.

**స్త్రీల ఆర్తనాదాలు ఎవరి చెవులకూ వినబడనంతగా మనుషులు మొద్దుబారిపోయారు.**

ఇప్పుడు ఒక వేడుకలా దేశదేశాల్లో బాలికాదినోత్సవాలు, మానవ హక్కుల దినం, మాతృదినోత్సవం, మహిళాదినోత్సవం జరుపుకుంటున్నారు. 25 నవంబర్‌ను International No Violence Against Women, White Ribbon Dayగా పక్షం రోజుల పాటు 25 నవంబర్ నుండి 10 డిసెంబర్ మానవ హక్కుల రోజు వరకు 16 రోజుల కార్యాచరణ చేపడుతున్నారు. కానీ నానాటికీ తీసికట్టుగా మానవ గౌరవం, మానవ హక్కులు, మహిళల హక్కులు ఘోర ఉల్లంఘనకు గురవుతున్నాయి. ప్రతిరోజు ప్రతి నిమిషం స్త్రీలపై లైంగిక, శారీరక హింస, శ్రమ దోపిడీ అణిచివేత నిసిగ్గుగా కొనసాగుతున్నది.

భారతీయ మహిళల జీవన ప్రయాణం చరిత్ర పొడుగునా 'సతి' మంటల (బాల్య వివాహాలు) నుండి 'వైధవ్యపు' చెరల దాకా నెత్తుటి కాలువలుగా ప్రవహిస్తున్నది. స్త్రీల హాహాకారాలు అగ్నికీలల్లో కాలి బూడిదైపోతున్నవి. స్త్రీల ఆర్తనాదాలు ఎవరి చెవులకూ వినబడనంతగా మనుషులు మొద్దుబారిపోయారు.

చట్టాలంటారా ఉన్నాయి కానీ వాటినీ ఉల్లఘించడం నేరస్తులకు నల్లేరు మీద నడకలాంటిదే. మత, కుల-జాతి, ఆర్థిక హోదా, స్థాయిల పరంగా వర్గాలుగా చీలిపోయిన వ్యవస్థలో స్త్రీల హక్కులు, గౌరవం, స్వేచ్ఛ, విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా అణిచివేతకు గురవుతున్నాయి. ఈ యథాతథ మూడు సర్పాలు - ఒకే కాటు వ్యవస్థలో మానవ వనరులు, మానవ చైతన్యం నీరుగారి కునారిల్లిపోతున్నది. స్త్రీలు, నిమ్న వర్గ సమూహాలు తిరస్కృతులు, సంఘ బహిష్కృతులుగానే మిగిలిపోతున్నారు.

×××

ఈ నేపథ్యంలో మన దేశంలో ఉన్న 40 మిలియన్ల వితంతు స్త్రీలు అతిపెద్ద బాధిత సమూహంగా నిస్తేజంగా నిరాశగా మన వైపు చూస్తున్నారు. క్రీనీడల్లా, ప్రాణమున్న శవాలుగా నిరాదరణకూ, అవమానాలకూ, సామాజిక ఆచార సాంప్రదాయ 'ఆచార న్యాయాల'కు లోబడి బలిపశువుల్లా మార్చబడి చీకటి కొట్టాల్లో నిర్జీవుల్లా జీవిస్తున్నారు!?

అన్ని నేరాలు వితంతు స్త్రీల పట్ల నీచాతినీచంగా జరుగుతున్నాయి. వైధవ్యం అనే మచ్చ కేవలం బొట్టూ, గాజులు, పూలు అనే భౌతిక అలంకరణలకు పరిమితమైన దుశ్శాసనం కాదు. ఒక్క భర్త మరణించాడన్న కారణం చేత ప్రతి రోజూ జీవన పర్యంతం పది లక్షల చావులైనా ఆ స్త్రీ చావాల్సి వస్తుంది. ఇదేనా మన సంప్రదాయం? మహోన్నతమైన మన భారతీయ సంస్కృతీ ఆచార వ్యవహారం?




ఆడవాళ్ళకే ఇది ప్రత్యేకమైన శిక్ష!? ఏ వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, స్మృతులు, శతకాల్లో ఈ శిక్షలు లిఖించబడి ఉన్నాయో ! కుటుంబం అనే బండికున్న రెండు చక్రాల్లో ఒక చక్రం ఊడిపోతే ఒంటి చక్రంతో బండిలాగడం సంసార సాగరాన్ని ఈదడం స్త్రీలు చేయాల్సి వస్తుంది. రెండు చక్రాలు ఒకే పరిణామంలో బలంగా కుటుంబమనే బండికి బిగించబడి ఉండాలి. కానీ ఆచార దూరాచార సంప్రదాయాల బలవంతపు ఆచరణా అమలూ స్త్రీల పాలిట ఏనాటిది, ఎక్కడిదైన శాపం, ఇదేమి అసంబద్ధ న్యాయం? పైగా స్త్రీలను బలవంతంగా ఒప్పించి వారిచేతే ఈ దురాచారాలను ఆచరింపజేయడమే ఒక అధికారిక మోసం.

ఒక కాలం నాటి ఆచార సంస్కృతులు మరో తరం నాటికి మార్పు చెందుతూ ఉంటాయి. నిలువనీరులా పురుగులు పడి దుర్వాసతో ఏదీ ఉండకూడదు. ఉంటే తట్టుకోలేము మరి ఇంకా ఎందుకు తుప్పుపట్టిన సంకెళ్ళను వేస్తూ సగం మానవజాతిని హింసిస్తున్నారు, అణిచివేస్తున్నారు ? 'న్యాయం' అనేది సమం కాదా? 'న్యాయం' అంటే పాక్షికమైనదీ పక్షపాతంతో కూడినదనా? చట్టం, శాసనం, న్యాయం ఎవరికి చుట్టాలు ? కాగితం పులులు భయపెడతాయా, నేరాలను అరికడతాయా.. ఆలోచించాలి కదా.

వితంతు స్త్రీల మనోవేదన, జీవన సంక్లిష్టతలు, బతుకు సంక్షోభం ఎవరికి పట్టింది, ఎవరు లెక్కచేస్తారు. వారి ముఖాల మీద నీకు స్వేచ్ఛా కదలికలు నిషేధం అని చాటే 'నో ఎంట్రీ' బోర్డు పెడతారు. దీన్నే Cultural Conditioning అంటారు. సాంస్కృతిక అణిచివేతను సాంస్కృతిక నియంత్రణ ద్వారా కొనసాగించే అమానుషత్వం, ఆధిపత్య దురహంకారాలు 'బ్రాహ్మణీయ పితృస్వామ్య నియంతృత్వపు' దాష్టీకాలు. ఈ సమాజంలో బాధిత స్త్రీలు, దళితులు అనుభవిస్తున్న కఠిన శిలాశాసనాలు అవి. ఆ శాసనాలు రాతిపై చెక్కబడేవి కావు, తలరాతంటూ నిస్సహాయుల నుదిటి మీద చెక్కబడుతాయి.

×××

మన ప్రభుత్వాలు, స్త్రీల సంక్షేమానికని కొన్ని పథకాలు ప్రకటిస్తున్నారు. అవి తాత్కాలికంగా అరకొరగా ఉపయోగపడేవే. విశాల ప్రాతిపదికన విధాన రూపకల్పన జరగలేదు ఇంతవరకు. స్త్రీలు ఆటబొమ్మలే పితృస్వామ్య అధిపతులకు. 49 శాతం ఓటింగ్ నిర్ణాయక స్థానంలో ఉన్నా స్త్రీలు మోసగింపబడుతూనే ఉన్నారు. భక్తి మోక్షాల ముసుగుల్లో, వారి పోషణా బాగోగులూ భరించే శక్తిలేదన్న నెపంతో స్వార్థ కుటుంబ సభ్యులు, సంతానం కలిసి విడో సిటీస్‌కు వేరే ఊళ్లకు, రోడ్లమీదికి వారిని తరిమేస్తూనే ఉన్నారు. దయనీయమైన పరిస్థితుల్లో వీధుల్లో, దర్శనీయ స్థలాల్లో, బస్‌స్టాండ్‌లు, రైలు స్టేషన్లు అక్కడనీ ఇక్కడనీ లేదు అంతటా వీళ్ళు కడుదీనంగా అనాథలుగా అడుక్కునే వాళ్ళుగా కనిపిస్తుంటారు.

ఇదంతా విలువల విధ్వంసం, మానవ సంబంధాల పతనం. 'కుటుంబం' అనే ఒక సమగ్రమైన కేంద్రం ఎక్కడుంది ఇప్పుడు. దాన్ని మనం ఎప్పుడో కుట్రలకు, స్వార్థాలకు బలి ఇచ్చేసాము విచ్ఛిన్నం చేసాము. ఇప్పుడున్న కుటుంబా లోపలంతా డొల్లగా ఉండి పైకి కనిపించే రూపం. కాబట్టి ఇంకా మనల్ని మనం వంచించుకుంటూ కుటుంబం అంటూ గొప్పలు చెప్పుకోవద్దు. నా వాళ్ళు అంటూ అబద్ధాలు వల్లించొద్దు. ఆత్మీయతలు, అన్యోన్యతలు నశించిపోయాయి. నిజం చెప్పాలంటే ఇప్పుడు అన్నీ డబ్బులు, ఆస్తులు, ఐశ్వర్యాలతో ముడిపడి నటిస్తున్న సామాజిక సంబంధాలే, ఎంత బుకాయించినా ఇదే వాస్తవం.

ఇప్పుడు కావాల్సింది అరకొర 'న్యాయం', పాక్షిక న్యాయం కాదు. విప్లవీకరణ జరగాల్సింది విలువల పునఃస్థాపన కోసం. నైతికతను, సమానతను పునర్నిర్వచించుకోవాలి. మన సంఘానికి పునర్నవం రావాలి. నవశక రచన ప్రారంభించాలి.. దుష్ట కరోనా కాలాన్ని గుర్తు చేసుకుందాం. బాధలు, కష్టాలు, విషాదాలు అందరికీ సమానంగా ప్రజాస్వామ్య బద్ధంగా పంచింది కరోనా కాలం. చెడు నుండైన మంచిని పిండి ఒడిసిపట్టాలి.

×××

స్త్రీలను బహుపాత్రల్లోకి (Roles) విభజించి గుర్తించడం, పాలించడం స్త్రీల దుస్థితికి కారణంగా ఉంటూ వస్తున్నది. స్త్రీలు అస్తిత్వపరంగా గుర్తింపులేకుండా శాశ్వత గ్రహణంలో ఉండిపోతున్నారు. కృష్ణపక్షమే స్త్రీలకు నివాస స్థలం అని సమాజం తీర్మానించింది.

అందుకే ఇప్పుడు మన మాతృభూమి విముక్తికై మొరపెట్టుకుంటున్నది. నీడల్లా ఉన్న దేవతలు.. సజీవత్వం కోసం పెనుగులాడుతున్నారు. అందరమూ అంధకారంలోనే ఉండి నేరాలు చేస్తున్నాం. వెలుగుల జీవనం కోసం మనలో దీపాలు వెలిగించుకోవాలన్న స్పృహ లేకుండా కారు చీకటిలో తచ్చాడుతున్నాం. ఏ నమ్మకమూ ఆశా లేదు. మనలో దీపాలు వెలిగించుకొని మనమే వెల్తుగై వ్యాపించాలన్న ఆలోచన రావాలి మనకు. మన చుట్టూ చీకటి ఎంత గాఢంగా వ్యాపించి ఉన్నా అంతకు ఎన్నో రేట్లు వెలుగు మనను ఆవరించి ఉన్నదని గ్రహించాలి.

మూఢ విశ్వాసాలు, మూర్ఖ భావనలతో ఏ వ్యవస్థా నడవదు కుంటుబడిపోతుంది. కుళ్ళిపోయి రాసికారుతూ ఉంటుంది. కొత్త నీటి ప్రవాహాల కోసం మార్గాన్వేషణలు చేయాలి.

అసమతుల్యతలు అనాచారాలతో సంఘం ఎప్పటికీ పురోగమించలేదు. శాంతి పతాకపు రెపరెపల ఒక్కనాటికీ చూడలేము. యుద్ధాలు, దాడులు, ఊచకోతలు, ఉగ్రవాదాలు, ఉన్మాదాలు, అనివార్య వలసలు, ఘర్షణలు, కుట్రలు, రక్తపాతాలు ఎప్పటికీ అవసరంరాని సమాజం నిర్మించుకోవాలి. హింసవల్ల అభివృద్ధి అనేది ఉండదు. ఒక దేశ రాజ్యాంగం అనేది పౌరజనానికి మహోన్నతమైన మార్గదర్శకమైన పవిత్ర గ్రంథం. పౌర సమాజం చిన్నాభిన్నమై చెదిరిపోవ డానికి కారణం మొదటి నుండి రాజ్యాంగం పట్ల పౌరులకు కనీస అవగాహన లేకుండా ఉండటమే. రాజ్యాంగం తెలిసి ఉండటం అవసరం అన్న జ్ఞానం లేకపోవడం. పాలకులు ఆ దిశగా పౌరుల్ని చైతన్యపరిచే ఆలోచన లేకుండా ఉండి తమ పబ్బం గడుపుకుంటూ పోవడం ఒక అధికారిక తప్పిదనంగా ఉంటూన్నది.

×××

ఫెమినిస్టు చరిత్రకారిణి ఉమా చక్రవర్తి 'వేదకాలం నాటి స్త్రీ' గురించీ, లతామణి 'సతీసహ గమనం' గురించీ వివిధ అంశాలు సామాజిక నిర్బంధాలుగా స్త్రీ-పురుష సంబంధాలపై (Gender Relations) ఏ విధంగా ప్రభావం చూపుతాయో పరిశీలనాత్మకంగా చెప్పారు.

వైధవ్యం అంటే ఆధునిక బలిదానం. స్త్రీలు ఈ సమాజానికీ, సంఘశాసనాలకూ, శీల-పాతివ్రత్య నిబంధనలకు, ఆచార సాంప్రదాయాలకు తమను తాము అనుగుణంగా నియంత్రించుకుంటూ వ్యక్తుల్లా కాకుండా బానిసల్లా జీవిస్తున్నారు. మనుస్మృతి మాయల చట్రాల్లో బందీలయి గింజుకుంటున్నారు. ఎవరెన్ని చెప్తున్నా మార్పులు పైపైనే. అంతులేని వేదన, సమస్యల వలయాల్లో స్త్రీలు అస్థిమితంగా అసంపూర్ణ బతుకుల్ని అనుభవిస్తున్నారు. లింగ వివక్షతను, జండర్ అంతరాలను శిక్షలుగా భరిస్తున్నారు.

**స్త్రీ పట్ల వైధవ్యం, వితంతు అనే పదం ఇంకా మొరటుగా వాడే కొన్ని పదాలను మనం శాశ్వత్వంగా దైనం దిన జీవితంలోంచి తొలిగించుకోవాలి.**

స్త్రీ పట్ల వైధవ్యం, వితంతు అనే పదం ఇంకా మొరటుగా వాడే కొన్ని పదాలను మనం శాశ్వత్వంగా దైనం దిన జీవితంలోంచి తొలిగించుకోవాలి. వారిపట్ల సాంఘిక వివక్షతకు వ్యతిరేకంగా బలమైన చట్టమూ రావాలి. ప్రస్తుతం వారికి పెన్షన్, పిల్లలకు చదువు-విద్యలకు సౌకర్యం కలిగించాలి, స్త్రీలకు సమూహ ఆశ్రమాలు నిర్మించాలి. వితంతు స్త్రీలంటూ చిన్న చూపుతో కాకుండా ఎప్పటిలా ఉండటం, స్నేహపూరితంగా వ్యవహరిస్తూ ఉండటం సాటి మనుషులు చేయాలి.

×××

'భారతదేశంలో వితంతు వ్యవస్థ' అనే ఈ సంకలనం ఒక సాంఘీక ఉద్యమం! సంస్కరణ ఆలోచనలకు ఒక ముందడుగు. ఈ సంకలనంలో సామాజిక, సాహిత్య వ్యాసాలతో పాటు స్వీయ కథనాలు, నివేదికలు, సంస్కర్తల వ్యక్తిత్వాలతో 430 పేజీల గ్రంథంగా వెలువడింది. అనిశెట్టి రజిత ప్రధాన సంపాదకత్వంలో సంపాదకులుగా కొమ్రరాజు రామలక్ష్మి, తమ్మెర రాధిక, చందనాల సుమిత్రలు ఈ గ్రంథం బాధ్యతను తీసుకొని రుద్రమ ప్రచురణలు (A Warangal Women Literary Collective) ద్వారా ముద్రించారు.

ఈ అంశాన్ని ఒక ఉద్యమంగా సమాజాన్ని సోషలైజ్ చేయడానికి మీ అందరి నుండీ భాగస్వామ్యాన్నీ, సహకారాన్నీ కోరుతున్నాను. సమాజాన్ని సమానత్వం వైపు నడిపిద్దాం ! సమాజాన్ని చైతన్యీకరించుకుందాం ! మానవీకరణ ద్వారా మానవ సమాజాన్ని స్థాపించుకుందాం !



- అనిశెట్టి రజిత
9849482462

# అక్షర యోధుడు రామోజీ!



తెలుగు వెలుగుల జిలుగు,
తెలుగునాట ఉషోదయ కానుక
పేర్చిన అక్షర రమ్యతల
తరగని నిత్య శోభల
ఈనాడు రంగవల్లిక,
ఇంతింతై వటుడింతింతై అన్నట్లుగా
చెరుకూరి సంస్థల విజయకేతనం
ఆపూర్వం,
దశాబ్దాల పాటు విస్తరించిన
ప్రచండ తేజం
నవ భారతంలో
రామోజీ సంస్థల విశ్వరూపం,
అజేయంగా సాగుతోంది,
విపుల, చతుర, అన్నదాత, సితార,
తెలుగు వెలుగు,
బాలసాహిత్య పత్రికల పుట్టిళ్ళు,
రైతే రాజైనట్లుగా
రామోజీ అంటే చెల్లిన రూపాయే,
చిట్స్ అయినా, ప్రియా పచ్చళ్లయినా
తెలుగు ధనాన్నే కాపాడాడు!
కర్తవ్య సిద్ధిగా వరించిన
వివిధ విశ్వవిద్యాలయాల గౌరవ డాక్టరేట్స్
విలువల్ని పెంచిన మహనీయుడు,
భారత ప్రభుత్వ పద్మ విభూషణుడు,
మీడియా దిగ్గజం, మరో మేరు పర్వతం,
అరవై ఏళ్ళ పైగా దిగ్విజయ
వ్యాపారం- సాహసోపేత ప్రస్థానమే,
నీతి-నిజాయితీలే పెట్టుబడులై
వ్యాపార సోపానాలై ఆదర్శంగా నిలిచి
పదుగురికి మార్గదర్శకుడైనాడు,
పదునైన ఆయుధమై
ప్రజా పక్షమైన అక్షర యోధుడై
ఇలలో శాశ్వతత్వాన్ని నిలుపుకున్న
అలసట లేని విజయరథం,
జాతీయ రాజకీయాలలో ఫలాపేక్ష లేని
రామోజీ చక్రం త్రిప్పిన తీరు జగద్విఖ్యాతం,
ఎంతోమంది విద్యావంతులకు
ఉద్యోగాలు ఇచ్చి
కష్ట సుఖాల్లో పాలుపంచుకొన్న రాజర్షి,
పాత్రికేయానికి వన్నెలద్దిన కలంకారుడు, ,
ఈనాడు ఈ టీవీలు విస్తరించిన తీరు
ఉపఖండఖ్యాతిని విఖ్యాతం చేశాయి,
మరో నవ శకానికి నాందీ పలికాయి,
వివిధ భాషల్లో సినిమాల నిర్మాణం,
రామోజీ ఫిల్మ్ సిటీ స్థాపనం,
మరో విశ్వకర్మయై
ప్రపంచ చరిత్రల్నే తిరగరాశాయి,
ఆటు పోట్ల జీవితాన్ని చవిజూసినా,
వాన ప్రస్థానంలో వెన్నుపోట్ల
సవాళ్ళనెన్నింటినో ఎదుర్కొన్నా
సన్మార్గంపైనే ఆయన నడక
నల్లేరుపై నావై సాగింది,
ఎనిమిదిపదుల జీవయాత్ర
అజరామరమైన కీర్తి పర్వమై
ఆత్మగౌరవ సమర్థతతో
సుఖయాత్రగా మిగిలింది,
రామోజీ మీకు
తెలుగు జనత అశ్రునివాళి!!!



- సంకేపల్లి నాగేంద్రశర్మ,
8074826371

# చిరుగాలులు

చిరుగాలులు వీస్తుంటే
చిరుకొమ్మలు ఊగుతుంటే
కళ్ళుచూస్తాయి అందాలు
వళ్ళుపొందుతుంది ఆనందాలు.

చిరుగాలులు సాగుతుంటే
చిరుమోములకు తగులుతుంటే
మురిసిపోతుంది నాహృదయం
వెలిగిపోతుంది నావదనం.

చిరుగాలులు సందడిచేస్తుంటే
చిటపటచినుకులు పడుతుంటే
ఆలపిస్తుంది నా అంతరంగము
అమృతవర్షం వినిపిస్తుంది రాగము

చిరుగాలులు సంతసపరిస్తే
చిరుముత్యాలు రాలుతుంటే
పొంగిపోతుంది నా మనసు
పరవశపరుస్తుంది ఆ సొగసు
చిరుగాలులు సుగంధాలుచల్లుతుంటే
చిరునవ్వులు కలిగిస్తుంటే
ఉప్పొంగుతుంది నా మది
ఉవ్విళ్ళూరుతుంది నా హృది.

చిరుగాలులు మబ్బులనెడుతుంటే
చిత్రమైనరూపాలు కనబడుతుంటే
ఆకర్షిస్తుంది ఆకాశం
ఆనందపరుస్తుంది అదృశ్యం.

చిరుగాలులు వంటినితాకుతుంటే
చల్లనిస్పర్శ పులకిస్తుంటే
సంబరపడుతుంది నా శరీరం
చెలరేగిపోతుంది నా మానసం.

చిరుగాలులకు స్వాగతం
చిరునవ్వులకు సుస్వాగతం
చిరుజల్లులకు ఆమంత్రణం
చల్లదనాలకు ఆహ్వానం



-గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్
సెల్: 7981616630

# బడి నానీలు

నేడు
పిల్లల స్పర్శ తగిలింది
బడి హృదయం
పులకించింది.

నేడు బడి
మౌనం వీడింది
పిల్లల పలకరింపులు
మొదలైనయిగా.

కొట్టుడు
మొదలయ్యిందిగా
కుంభకర్ణుని నిద్ర
వీడింది గంట
నల్ల బల్ల
ఫక్కున నవ్వింది
నేడు నన్ను
ముస్తాబు చేస్తారని



-చాపలమహేందర్
9949864152

పుస్తక సమీక్షలు

# సీదాసీదాగా విరమించని వాక్యం...!




ప్రతులకు:
-తపస్వి మనోహరం
పబ్లికేషన్స్
కొండాపూర్. హైదరాబాద్.
సెల్:7893467516

**ఆప్యాయతలు కురిసే**
**పలకరింపులు పోయి..**
**అవసరానికో నవ్వు**
**తప్పించుకోవడానికో అబద్ధం**
అంటూ నేటి సమాజం యొక్క తీరును తెలియజెబుతూ యువ కవి చింతా రాంబాబు **"విరమించని వాక్యం"** పేరుతో కవితా సంపుటిని వెలువరించారు.

**"కలలకు రంగుల రెక్కలు కట్టి**
**ఉన్నచోటు నుండి**
**ఉన్నత స్థితికి ఎగరేయటమే'** నా వృత్తి..

**"కాలాన్ని కవిత్వం చేసి**
**నెమలీకలా బతుకు పుస్తకంలో**
**దాచుకోవడం"** నా ప్రవృత్తి అంటూ కవి రాంబాబు తమ అంతరంగంలో కదలాడే భావాలకు అక్షర సొబగులు అద్ది అజ్ఞానపు చీకటిలో పయనిస్తున్న మెదళ్ళలో విజ్ఞాన విత్తులు తమ కవిత్వం ద్వారా చల్లేందుకు ముందుకు రావడం ముదావహం.

**దశాబ్దాలుగా చూస్తూనే ఉన్నాం**
**ఎక్కడా మార్పులేదు..**
**మార్పు కనిపించినా**
**వెలుగు చూడని మార్పు అని..**
**నాలుగు గోడల మధ్య.. ఉండేదే స్వేచ్ఛ అనుకుని**
**బ్రతికిన రోజుల నుండి**
**విశాల ప్రపంచం ఆమె కోసం**
**ఎదురుచూస్తున్న నేటివరకూ**
**ఆమెకు ఎండమావే.."** అంటూ అభద్రతా భావంతో.. రక్షణ కొరవడి.. అత్యాచారాలకు గురయ్యే మహిళల స్థితి ఎప్పటికీ విరమించని వాక్యమే.. అంటూ కవి తమ ఆవేదనను వ్యక్తపరిచారు.

కవి తమ "అమ్మతో పెనవేసుకున్న బంధాలను.. అనుబంధాలను.. అక్షరాల్లో ఆవిష్కరిస్తూ.. **"అమ్మ చీర కొంగు చాటు నేను"** కవితను రాశారు. ఎన్ని కష్టాలొచ్చినా.. బాధలు వెంటాడినా ఏ క్షణం కూడా ఆందోళన చెందకుండా ఆత్మ విశ్వాసమే ఆలంబ నగా తమ జీవితాన్ని గడిపిందని.. కొడుకుగా అమ్మ నుండి పొందిన ఆత్మీయతను-ప్రేమానురాగా లను.. చిన్నప్పటి జ్ఞాపకాలను కవి మనతో పంచుకున్నారు. **"అమ్మ"** కవితలోనూ అమ్మను ఉన్నతంగా ఆవిష్కరించారు.

కాలం యొక్క గొప్పదనాన్ని వివరిస్తూ **"కాలపు గాలం"** కవితను తీర్చిదిద్దారు. కాలం తిరిగి రానిదనీ.. మన చేతిలో ఉన్నట్లుంటుంది. ఎప్పుడు జారిపోతుందో ఎవ్వరికీ తెలియ దంటూ కవితను ఎత్తుకున్న తీరు బాగుంది. కాలంతో నడిస్తే ఎన్నో.. జీవిత పాఠాలు నేర్పుతుంది గురువులా.. **అంటూ కొనసాగించారు. "తొలి ప్రేమ" "నీ కోసం", "కౌగిలి దుప్పటి" "పెదవి దాటని మాట",** కవితల్లో కవి రాంబాబు ప్రకటించిన భావాలు ఊహాలోకాల్లోకి లాక్కొని పోయేలా ఉన్నాయి. సిగ్గు మొగ్గలు వేసిన ఘటనలను.. చిరునవ్వుతో కప్పేసిన వదనాన్ని చక్కగా ఆవిష్కరించారు.

**నాన్న చెప్పిన కథలన్నీ**
**మా జీవితాలకు పాఠాలుగా మారి**
**బంగారు భవిష్యత్తుకు**
**బాటలు వేసాయంటూ** నాన్న యొక్క ఔన్నత్యాన్ని చాటుతూ "నాన్నే నా హీరో" కవితను రూపుదిద్దారు.

**"అలక'** కవితలో అన్నదాత యొక్క మనసును ఆవిష్కరించారు. రైతన్నకు మేఘాలు ఆడే.. దోబూచులాటలు నిత్యం పరిచమే.. అంటూ కొనసాగించారు.

ఆలోచింపజేయడమే కాక, స్పందింపజేసేది, ప్రేరణ కలిగించేది, ప్రశ్నింపజేసేది, పోరాటం చేయించేది, కొత్త ఉత్సాహాన్ని నింపేది, అంతేగాక నవ్వించేది, కవ్వించేదీ అక్షరమే అంటూ **"అక్షరం"** కవితను రాశారు.

జీవితాన్ని గురించి తెలియజెబుతూ.. కవి రాసిన కవిత బాగుంది. మనిషిలో ఉండే వివిధ స్వభావాల రంగులమయమే జీవితమని తెల్పి చెప్పారు. సప్త వర్ణ మేళవింపు జీవితానికి సంపూర్ణ పలకరింపు అనీ.. సరైన వ్యక్తిత్వం ఏపుగా పెరిగితే ఆనందమనే పూలు పూస్తాయని వివరించారు.

**నింగి నుంచి చినుకురాలి**
**నేలను తాకడం 'కవిత్వమంటే'**
**అంటూ** రాసిన కవితలో.. కవిత్వం గురించి విభిన్న కోణాల్లో కవి అభిప్రాయాలను మనతో పంచుకున్నారు.

**"ఆభరణం"** కవితలో చిరునవ్వే నీ ఆభరణమైతే..
**ఎదుటి వారు**
**ఎంతటి ఘటికులైనా**
**నీ వశమై పోతారంటూ** నవ్వు యొక్క గొప్పదనాన్ని చాటి చెప్పారు. అలాగే ఖచ్చితత్వం, ఆత్మవిశ్వాసం, మంచితనం, నిజాయితీ వంటి సుగుణాలను మనం మన ఆభరణాలుగా మలుచుకుంటే ఒనగూరే ప్రయోజనాలను తెలియజెప్పారు. ఇలా ఎన్నో కవితా పంక్తులు ఉదహరించడానికి వీలుగా ఉన్నాయి.

ఇలా ఈ కవితా సంపుటి కోసం.. కవి ఎంపిక చేసుకున్న కవితా వస్తువుల్లో వైవిధ్యమున్నప్పటికీ.. కవి అభివ్యక్తిలో ఇంకా శ్రద్ధ చూపాల్సి ఉన్నప్పటికీ ఆయన ఆలోచనా ధారను అభినందించి తీరుతాం.. కనీస కవిత్వ ప్రమానాలు పాటించాల్సి ఉన్నప్పటికీ.. ఆయన సామాజిక చింతనను.. మెచ్చుకొని తీరుతాం.. కవిత్వానికి గుప్తత, క్లుప్తత ఆభరణాలు అన్న విషయాన్ని కవి గుర్తించాల్సి ఉంది. శిల్పం విషయంలో చతురత ప్రదర్శించాల్సి ఉంది. వస్తు స్పష్టతతో రాయాలన్న సంగతిని కవి గుర్తించాల్సి ఉంది. పదబంధ ప్రయోగంలో ఔచిత్యం అవసరం అన్న విషయాన్ని గ్రహించాలి. అధ్యయనం ద్వారా తమ కలానికి పదును పెట్టుకుంటూ ముందు గాఢమైన కవి త్వాన్ని మనకు అందిస్తారని ఆశిద్దాం.



- దాస్యం సేనాధిపతి
సెల్:9440525544

# మబ్బుల మాటున..!

మబ్బుల మాటున వర్షం దాగినట్లు..
అవకాశాల చాటున దాగును గెలుపు!
కుమిలితే కన్నీటి ఊటల వరదలు
పోరాడితేనే ఆవిరైపోవు చెమటలు!
నీరందితేనే పంట పైరు పచ్చన..
తృష్ణ ఊరితేనే విజయతీర చెంతన!
సంకోచమే సగం ఓటమి..
వ్యాకోచమే పూర్ణత్వ కలిమి !
అక్షరంతో ఆగితే నిష్ఫలం..
భావాల్ని పండిస్తేనే ప్రజోపయోగం!
మెట్లెక్కడం వీరత్వమే కావచ్చు..
కాలు జారినా సాగిపోవడమే ధీరత్వం!
సౌశీల్యమే మూర్తిమత్వం..
అహంకారమే అధఃపాతాళం!
కన్నీళ్లతో కుంగితే విఫల సూచనం
చెమట కక్కితేనే విజయ దరహాసం!
వస్తు వ్యామోహంతో సుఖ వర్షం
ఆత్మ తృప్తితో ఆనంద సంద్రం!



-మధుపాళీ
9949700037



# సప్తపది

సృజనకర్త : సుధామ

జీవిత సత్యాల ఆవిష్కరణం-సామాజిక బ్రతుకు ఘటనల వ్యాఖ్యానం

లఘు కవితా ప్రక్రియ

హితవరి విహారి,శాంతమూర్తి గార్ల నిర్వహణలో

వివిధ కవుల సప్తపదులు

రాగాలు
సరాగాలు
వలపు జంటలకు అలుపులేని నిరంతర ప్రణయభోగాలు
-సిహెచ్.వి. బృందావన రావు, నెల్లూరు

శ్రీమతి
బహుమతి
అవసరానికి అశ్రువులు కాగలవు పెద్ద గుమితి
(గుమితి: ఆయుధ విశేషము)
-వి శ్రీనివాస మూర్తి, హైదరాబాదు

ఆలోచన
దీర్ఘాలోచన
మంచిపనులు- సాఫల్యానికి ఉత్కృష్టమైన సమాలోచన !
-కె.కె.తాయారు. మదనపల్లి (చిత్తూరుజిల్లా)

నవతరం
యువతరం
బంగారు భవితకై ప్రణాళికతో పాటుపడాలి నిరంతరం
-సాధన.తేరాల,ఖమ్మం,

ఊకొట్టు
జైకొట్టు
మరువకు, రాజకీయాల ప్రసంగం మాయమాటల కనికట్టు.
-నాగరాజు.చుండూరు, లండన్

రంగం..!
రణరంగం...!!
మనిషి జీవితమే సమాజంలో ఒక
చదరంగం....!!!
-మహమ్మద్ అంకూస్, బెల్లంపల్లి

దేహం
దాహం.
జ్ఞానమే మార్గం -అధిగమించడానికి బతుకుపై వ్యామోహం!
-డాక్టర్ మామిదాల శైలజ, సహాయ ఆచార్యులు హనుమకొండ

శిథిలం
వదలం
పురావస్తు తవ్వకాలతో పాత నాగరికత పదిలం
-అవసరాల పద్మజారాణి, విజయనగరం

విసుర్లు
కసుర్లు
సగటు గృహిణికి ఎనలేని బలమిచ్చే కొసర్లు
-మంగు కృష్ణకుమారి, విశాఖపట్నం

ఆవాసము
సహవాసము
నిత్యము ఆచరించు ఆరోగ్యం కొరకు యోగాభ్యాసము
-ఆర్. రమాదేవి, హైదరాబాద్

మూరెడు
బారెడు
ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేది చేరెడు
-ఎం ఏ గఫార్, ఉప్పునుంతల నాగర్ కర్నూల్ జిల్లా

నీరం
హారం
దేవునికి సమర్పిస్తే లభిస్తుంది తప్పకుండా వరం.
-దోసపాటి వేంకటరామచంద్రరావు, విజయనగరం

రణం
రుణం
శాంతికొరకు దూరంగా ఉండు వీటికి తక్షణం!
-జంజం కోదండ రామయ్య, జమ్మిపాళెం

ఎత్తులు
జిత్తులు
నాయకులు స్వార్థపరులై ప్రజలతో ఆడే గమ్మత్తులు
-కాయల నాగేంద్ర, హైదరాబాద్

రేపు
మాపు
ఆపు వాయిదా .-లేకుంటే శాంతిని రూపుమాపు
-యలమర్తి అనూరాధ, హైదరాబాద్

గర్వం
ఖర్వం
ప్రతిఫలం ఆశించని పరోపకారం పొందును సర్వనీ
-కాశీ మూర్తి, హైదరాబాద్

బాణి
కీరవాణి
అతని రాగాల మేళవింపు కురిపించు మధురసవాణి
-శేష శైలజ(శైలి), విశాఖపట్నం

అరాచకం
పరాచికం
అధికారం అక్రమాలకు రహదారి అని జనవాచకం.
-పట్నాల ఈశ్వరరావు, విజయనగరం

దూరం
భారం
లక్ష్యశుద్ధితో చేరుకోవాలి అయినా గెలుపు -తీరం!
-డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచార్య, మహబూబ్ నగర్.

మిడిమిడి!
బుడిబుడి!!
జ్ఞానసముపార్జన వైపు ఏమయినా అడుగులు వడివడి!!!
-మన్నవ సుధాకర్, విజయవాడ.

రాత
గీత
ఎవరి జీవితంలోనూ ఆనందానికి కావొద్దు కోత.
-గుండం మోహన్ రెడ్డి, నర్సాపూర్, మెదక్

ఉచితం
అనుచితం
ఆలోచనచేస్తూ అవసరమైన వాటిని అందించుట -సమయోచితం!
-మొర్రి గోపి , కవిటి

ఆటలు
పాటలు
ఓటమి నేర్పిన పాఠాలు -గెలుపుకు బాటలు
-సింగీతం విజయలక్ష్మి, చెన్నై

ఆడ
ఈడ
ఉండే అందమైన ఊరపిచ్చుకలు ఈనాడు ఏడ
-నెల్లుట్ల శ్రీనివాసులు, చెన్నై

ఉచ్ఛ్వాస
నిశ్వాస
యోగాలో ముఖ్యమైనది శ్వాస పైన ధ్యాస!
-ఆచంటి శ్రీనివాసరావు, తెనాలి.

అపార్థకము
భావార్థకము
నాణ్యత లేనప్పుడు మాటల్లో మౌనం సార్థకము
-కృష్ణ తేజ, హైదరాబాద్

అధికారం
అహంకారం
వ్యక్తికి లేకుంటే- సహకారం చక్కని అలంకారం .
-ఉపద్రష్ట సుబ్బలక్ష్మి, హైదరాబాద్

ఆరోపణ
ఆక్షేపణ
ఇతరుల మనసు గాయపడితే కోరాలి క్షమాపణ.
-కె. ఎమ్. కె. మూర్తి, సికింద్రాబాద్.

రాము
తేము
ఏదీ పోయేటప్పుడు వెంట తీసుకొని పోము
-కామేశ్వరి వాడ్రేవు, రాజమహేంద్రవరం

సిద్ధి
బుద్ధి
భగవంతుని అనుగ్రహం పొందాలంటే
ఉండాలి అంతశ్శుద్ధి
-యడవల్లి విజయలక్ష్మి, రాజమండ్రి

# నా మాట



- బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
తొలి ఛైర్మన్ బీసీ కమిషన్,
తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

మా తాత అన్నం గురించి ఒక చక్కని కథ చెప్పేవాడు. అన్నం పరబ్రహ్మంరా...! మన తలెలోకి అన్నం ఉత్తగనే రాలేదు. రైతు ఇత్తనం ఏసిండు. ఇత్తనం వరిమొక్క అయింది. వరి నాట్లు ఏసింద్రు. కలుపులు తీసింద్రు, కోత కోసింద్రు. కల్లం కొట్టింద్రు. బస్తాలకు ఎత్తింద్రు. ఇంటికి తెచ్చింద్రు. ఎలుకలు తినకుండ ఎన్నో నెలలు దాచిన్రు. వడ్లు దంచింద్రు. బియ్యం కడిగింద్రు. పొయ్యి మీద పెట్టింద్రు. అన్నం అయ్యింది. గింతదూరం అన్ని కష్టాలను తప్పించుకుని ఉడికినాక నన్ను తినకుండా పడేస్తున్నారని అన్నం ఏడుస్తదిరా... ఒక్క మెతుకు కూడా పడేయకుండా తినాలె... అని చెప్పేవాడు. ఆ కథ నాకు బాగా నచ్చింది.

అలా అన్నం మెతుకుల వెనక ఎంత శ్రమ ఉందో, ఎంత కథ ఉందో మా తాత తనమాటల్లో సింపుల్‌గా చెప్పాడు. అంతిమంగా అన్నం పరబ్రహ్మం అని దేవునితో సమానమని అన్నాడు. ఇలా సామాజిక పరిణామమంతా మా తాత ఒక అన్నం మెతుకులో చూపేవాడు.

మనకు అనగనగా ఒక రాజు ఆ రాజుకు ఏడుగురు కొడుకులు, ఏడు చేపలు తెచ్చారు కథ తెలుసు. పుట్టలో వేలు పెడితే చీమ కుట్టితే అది ఎన్ని పరిణామాలకు పరస్పర ప్రభావాలకు దారి తీసిందో ఈ కథ అద్భుతంగా చెబుతుంది. ఈ కథ గొప్పతనాన్ని 'కథా రచనకు కథకుడి పాఠాలు' పుస్తకంలో విశ్లేషించాను.

'రామాయణం', 'భారతం', 'పంచతంత్ర' కథలు, 'కథాసరిత్సాగరం', 'గాథాసప్తశతి' పురాణాలవంటి సాహిత్య ప్రక్రియల ద్వారా ఆనాటి సామాజిక రాజకీయ ఆర్థిక, సాంస్కృతిక పరిణామాలు, పరస్పర ప్రభావాలు, సంబంధాలు అవి మానవ సంబంధాలను నిర్దేశించే తీరు తెలుసుకుంటున్నాము. ఆధునిక ప్రక్రియలైన కథా నవల తదితర సాహిత్య ప్రక్రియల్లో ఇది సాధించాలని నా ప్రయత్నం. ఈ లక్ష్యం ప్రత్యేకమైనది. అందువల్ల కథ స్వరూప స్వభావాలు, కథ ప్రజెంటేషన్ ప్రత్యేకంగా రూపు దిద్దుకున్నాయి.

ఆధునిక జీవితాన్ని రాజకీయాలు, రాజకీయ నిర్ణయాలు, అభివృద్ధి పరిణామాలు నిర్వహిస్తున్న పాత్రను నిర్దిష్టంగా, విశ్లేషించి చూపకపోతే కథలు రాయడం దేనికి అనిపించింది. అలా చిత్రించకపోతే రాజకీయాలకు అతీతంగా మనుషులు, కుటుంబాలు, బతుకు తున్నట్లుగా మానవ సంబంధాలు ఉన్నట్లు భ్రమ కల్పించినట్లు అవుతుంది. ఈ లక్ష్యంతో అనేక విషయాలను కథలో కలిపి చెప్పే శైలీ శిల్పం పరిణామం చెందింది. ఇటీవల ఇంటర్నెట్‌లో రాస్తున్న కథల శైలీశిల్పంలో కూడా కథానిక స్వరూప స్వభావాలలో అనేక మార్పులు ప్రవేశపెట్ట బడ్డాయి. బుర్రకథ, హరికథలవలె అనగా రాసే పద్ధతి కథలలాగ కాకుండా మౌఖికంగా ఎదుటివారికి, పాఠకులకు ప్రత్యక్షంగా చెప్పే కథలోలాగ కథతోపాటు, వర్ణనతోపాటు, వ్యాఖ్యానం, విశ్లేషణ, అభిప్రాయ ప్రకటన కూడా ఇంటర్నెట్‌లో రాస్తున్న కథల్లో కనపడుతుంది. ఈ శైలీ శిల్పం రోజురోజుకు వ్యాప్తి చెందుతున్నది. ఇది సినిమా చూసి వచ్చిన తర్వాత, ఒక నవల, ఒక కథ చదివిన తర్వాత దాన్ని ఎదుటివార్కికి చెప్పే కథన ప్రక్రియ వంటిది. ఈ పద్ధతిలో నేను కొన్ని కథలు రాశాను.

ఆక్రమంలో స్థలాభావం రీత్యా, వ్యక్తిత్వాలకు, స్వభావాలకు ప్రాధాన్యత నిస్తూ... హావభావ వర్ణన, శరీర వర్ణన, ప్రకృతి వర్ణన, పరిసరాల వర్ణన, సంఘటనల వర్ణన, రక్తసంబంధాల తీరుతెన్నుల వర్ణన వదిలేశాను. వివరంగా రాస్తే కథను నవలగా రాయాల్సి ఉంటుంది. ఇలా ఈ కథలు కథానిక పరిమితిలో నేనున్న స్థల కాలాల, సామాజిక పరిణామాలను పరిచయం చేయడానికి, విశ్లేషించడానికి రాశాను.

నేను ఇందులోని కొన్ని కథల్లో సంబోధనాపూర్వక శైలీ శిల్పాన్ని తీసుకున్నాను. అది లేఖగా, తానే స్వయంగా మాట్లాడుతున్నట్లుగా, సంభాషణగా ఉండే రీతుల్లో గమనించవచ్చు. రవీంద్రనాథ్ ఠాగూర్ చాలా కథలను ఈ పద్ధతిలో రాశారు. ఈ పద్ధతిలో అనేక విషయాలను చెప్పే సౌకర్యం ఉంటుంది. తెలుగులో, ఇంగ్లీషులో ఇలాంటి ప్రయత్నాలు జరిగాయి. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, 'మార్గదర్శి' అని కథ రాశారు. కాళీపట్నం రామారావు 'కుట్ర' అని కథ రాశారు. నేను ఈ కోవలో కొన్ని కథలు రాశాను. ముఖ్యంగా 'వరుసలు', 'పంజరం', 'నానమ్మ' కథలు ఈ కోవకు చెందుతాయని చెప్పవచ్చు.

ఇందులోని చాలా కథలు ఇతరులు రాయలేకపోవడంవల్లనే నేను రాయాల్సి వచ్చింది. చాలామందికి ఇందులోని విషయాలు తెలుసు. అయినా... వాటికి కథల రూపం ఇవ్వడం అంత సులభం కాదని వారికి తెలుసు. అందువల్ల అన్నీ తెలిసినప్పటికీ అందరూ కథలు రాయలేకపోతున్నారు. కొందరే కథలు రాయడానికి కారణం కూడా ఇదే.

కథల్లో యథార్థ చిత్రణతోపాటు, పాత్రల ఆదర్శీకరణతోపాటు. సంక్లిష్టతనుండి స్పష్టతవైపు సాగాలి. చిక్కుబడ్డ దారాలను పోగులు తెగకుండా చిక్కులు తీయాలి. చూడగలిగే స్పష్టత ఉంటే సంక్లిష్టతలన్నీ రంగుల్లో, కథల్లో చిత్రించవచ్చు. జీవితాన్ని స్పష్టంగా చెప్పినప్పుడు అన్ని అంశాలను చిత్రించడం కూడా సాధ్యమే. వాస్తవిక జీవితాలకు జోడించిన కల్పనాశక్తి, ప్రయోగం, ఈ కథల్లో కూరలో ఉప్పులా పరిమితం... జీవితాల, సంస్కృతుల ఆదర్శీకరణ, వాస్తవీకరణ ఈ కథల లక్ష్యం. తద్వారా పాఠకులు, ప్రజలు అనేక విషయాలు తెలుసుకుంటారు. ఎన్నో విషయాలు తెలుసుకున్నామని ఆనందిస్తారు. మరిన్ని రచనలు చదవడానికి ఉత్సాహం చూపిస్తారు. కాలక్షేపం సాహిత్యం వల్ల ప్రజలకు ఈ ప్రయోజనం సిద్ధించదు.

ఇందులోని కథలు సామాజిక పరిణామాల 'సంసార సాగరం'లోని, కొన్ని నీటిబిందువులను కథలుగా రూపొందించడం జరిగింది. ఈ కథలే మొత్తం సాగరం కాదు. సాగరాన్ని, దాని వైశాల్యాన్ని తెలుపవు. అయినా లోకరీతిని అన్నం మెతుకులాగ తెలుపుతాయి.

సాహిత్యంలో మానవీయత అవసరం. మానవతా విలువలు, సంస్కృతి ప్రతిపాదించడం, ఉన్నతీకరించడం, సాహిత్య కర్తవ్యాల్లో ఒకటి. పత్రికల్లో ఈ కథలు వచ్చినప్పుడు ఎంతోమంది పాఠకులు స్పందించారు. తమ జీవితాలను ఎలా ఉన్నాయో పోల్చుకున్నారు. వాటిని ఎలా తప్పులనుండి సరిదిద్దుకోవాలో తెలుసుకున్నారు. తప్పులు రెండు రకాలు. తెలిసి చేసేవి. తెలియక చేసేవి. కాలక్రమంలో కొన్ని తప్పులు అనుకోకుండా జరిగి పోతుంటాయి.

జీవితం రోజూ రాసే ఒక పుస్తకం. పుస్తకాన్ని కంపోజ్ చేస్తున్నప్పుడు ఎన్నో తప్పులు దొర్లుతుంటాయి. ప్రూఫ్‌లు ఒకటికి రెండుసార్లు చూసినా ఇంకా కొన్ని తప్పులు మిగిలిపోతూనే ఉంటాయి. జీవితంలో ఇలా పుస్తకాలు కంపోజ్ చేసి నప్పుడు దొర్లే తప్పుల్లా అనేక తప్పులు, పొరపాట్లు జరుగుతూ ఉంటాయి. సాహిత్యం, కళలు, ఇతిహాసాలు, విశ్లేషణలు జీవితం అనే పుస్తకంలోని ప్రూఫ్‌లను సరిదిద్దుకునేట్టుగా చేస్తుంటాయి. ఈ జీవితం అనే డైరీలో... పేజీలన్నీ నీవే. రాసే నోట్‌బుక్ నీదే... పెన్ను నీదే... రాసేది నీవే... అందులో ప్రూఫ్ తప్పులు ఉంటూనే ఉంటాయి.

ఇవి కేవలం కల్పనా కథలు కావు. ఈ కథలు ఊహలనుండి పుట్టినవి కావు. ఇవి ఎందరివో స్వీయ చరిత్రలు, జీవిత చరిత్రలు కలిసివున్న సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక చరిత్రను నిక్షిప్తం చేసుకున్న కథలు. స్వీయ చరిత్రలు, జీవిత చరిత్రలు చదవడం ద్వారా వారి అనుభవాల గుణపాఠాలనుండి మన జీవితాలను, అందులోని పొరపాట్లను ప్రూఫ్‌లు దిద్దుకుంటూ జీవిత లక్ష్యాలను స్పష్టంగా నిర్మించుకొని ముందుకు సాగడం జరుగుతుంది. 'చికాగోలో

> అన్నం మెతుకుల వెనక ఎంత శ్రమ ఉందో, ఎంత కథ ఉందో మా తాత తనమాటల్లో సింపుల్‌గా చెప్పాడు. అంతిమంగా అన్నం పరబ్రహ్మం అని దేవునితో సమానమని అన్నాడు. ఇలా సామాజిక పరిణామమంతా మా తాత ఒక అన్నం మెతుకులో చూపేవాడు.

నానమ్మ', 'పాతచీర', 'వరుసలు', 'వేదవతి', 'వరలక్ష్మి', 'ప్రేమధార', 'మమతలు', 'పంజరం', 'మలుపులు', 'వారసత్వం', 'ప్యారసైట్స్' మొదలైన కథలు ఈ లక్ష్యంతో రాయబడ్డాయి.

వాస్తవికతపై ఆధారపడి ఆదర్శపాత్రలను, ఆదర్శ జీవితాలను, సమాజం ఉన్న తీరును చిత్రించడంతోపాటు, అది ఎలా ఉంటే బాగుంటుందో ఆదర్శ సమాజ రూపురేఖలను చిత్రీకరించడం నా లక్ష్యం. తద్వారా కథాచిత్రణలో అనేక పరిమితులెదుర్కున్నాను. ఊహాశక్తి, కల్పన ఏకాస్త ఎక్కువైనా అది వాస్తవాలకు దూరంగా ఉంటుంది. ఊహాశక్తి, కల్పనను ఆదర్శాలను, వాస్తవికతను కలిపి కథ రాయడం శ్రమతో కూడుకున్న పని.

సామాజిక పరిణామాలను కథలుగా మల్చడంలో చాలా శ్రమపడాల్సి వచ్చింది. నవలలుగా ఈ విషయాలు రాయడం సులభం కానీ, కథలుగా ఇమడ్చడంలో అనేక కష్టాలు ఎదురయ్యాయి. 'పంజరం' కథలో 'కూజాలో ఏనుగును పెట్టాలని' బీర్బల్ కోరిన కథలాగ కథా ప్రక్రియ పరిమితులు ఎదుర్కోవడం జరిగింది.

2

పారిశ్రామిక అభివృద్ధి ద్వారానే ఆధునిక అభివృద్ధి సాధ్యం అని అంతదాకా నమ్మిన మాకు పారిశ్రామిక రంగంలోని ఉపాధి అవకాశాలు కూడా కోల్పోవడం విషాదకరం. ఇది ఒక కొత్త పరిణామం అన్పించింది. నేను పుట్టి పెరిగిన సామాజిక వర్గం మహారాష్ట్రలో చాలాకాలం కార్మికులుగా పనిచేశారు. ఆ తర్వాత ఉపాధికోల్పోతూ వచ్చారు. సింగరేణిలో కూడా ఉపాధి అవకాశాలు పెరిగాయని సంతోషించిన తరం గడిచిపోకముందే ఉపాధినుండి నెట్టివేయబడ్డారు.

యాంత్రికీకరణ యొక్క అతివ్యాప్తి పారిశ్రామిక, కార్మికులను కూడా నిరుద్యోగులుగా మారుస్తూ వస్తున్నది. ప్రపంచీకరణ, మార్కెటీకరణ శక్తులు పెను తుఫానుగా ప్రపంచమంతటా విధ్వంసాన్ని సృష్టిస్తూ ముందుకు సాగుతున్నాయి. ఈ పరిణామాలు ఈ సంపుటిని ఒక మొత్తంగా పరిశీలించినప్పుడు అర్థమౌతాయి.

'చికాగోలోని నానమ్మ' గతాన్ని ప్రేమిస్తుంది. కొడుకు కోడలుతోపాటు మనవడు భరత్‌వంటి యువతరం గతాన్ని వదిలించుకుంటారు. స్వప్నవంటి మనవరాలు గతం లేకపోతే వర్తమానం లేదు అని అంటారు. వర్తమానమే ముఖ్యం. కొందరు వర్తమానంలోనే గతం పునర్జన్మిస్తుంది. అందువల్ల గతం అక్కరలేదు అంటారు. మరికొందరు భవిష్యత్ కూడా వర్తమానంలోనే ఉంటుంది. ప్రతిదీ వర్తమానమే. గతం, భవిష్యత్ అంటూ వేరేలేవు అంటారు.

రెంటిలోను సత్యం ఉంది. వీటిని ఏకపక్షంగా కొట్టేయడం కానీ, సమర్థించడం కానీ సాధ్యం కాదు. మనవరాలు స్వప్న గతాన్ని ప్రేమించనవసరం లేదు, నిరాకరించాల్సిన అవసరం లేదు. గతాన్ని గతంగా చూడాలి. గడిచివచ్చిన దశలుగా గౌరవించాలి. అంతేగాని గతాన్ని పట్టుకొని వేలాడకూడదు. సమాజం, సంస్కృతి నిరంతరం ముందుకు సాగుతూనే ఉంటుంది అని అంటుంది. నూతనత్వాన్ని ఆహ్వానించాలి. అందుకు హృదయాన్ని తెరిచి ఉంచాలి. దాన్ని వ్యతిరేకిస్తే వారిని వదిలివేసి సమాజం నూతన సంస్కృతి ముందుకు సాగుతూనే ఉంటుంది. నూతనత్వాన్ని అంగీకరిస్తే కనీసం నానమ్మలా గౌరవమైనా మిగులుతుంది. స్వప్న పెళ్లి కాకముందే నానమ్మను తీసుకొని తల్లిదండ్రులనుండి వేరుపడతానని అనడంలో దీన్ని గమనించవచ్చు.

'పాతచీర' కథలో మానవ సంబంధాలు కాలక్రమంలో ఎలా శిథిలమౌతూ నవతరం మానవ సంబంధాలు కొత్తగా ఎలా ముందుకు వస్తుంటాయో తెలుపుతుంది. ముసలివాళ్లు ఇంటి పెత్తనం క్రమంగా కోల్పోయి ఇంటివెనుక బతికేవాళ్ళుగా మారిపోతున్న క్రమం కనపడుతుంది.

'వరుసలు' కథలో అంతదాకా ఉన్న నువ్వులనూనె గానుగలు, వ్యవసాయంతో ఎదిగిన సామాజిక వర్గం నూనెమిల్లులు రావడంతో బట్టల మిల్లు కార్మికులుగా మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు వలస వెళ్లారు. అక్కడ కొందరు కొన్ని తరాలు జీవితాలు గెలుచుకున్నారో, ఓడిపోయారో గానీ ఆ తర్వాత అందరికీ ఓటమి పాలు ఎక్కువౌతూ వచ్చింది. పారిశ్రామిక కార్మికులు జీవితంలో ఎదిగే బదులుగా ఎందుకు శిథిలమౌతూ వచ్చారు? చేనేత రంగం వికాసాన్ని అడ్డుకుంటున్న మానవ కల్పితాలు ఏవి?

'వరలక్ష్మి' కథ ఒక ప్రత్యేక అంశం చెప్పాలని రాశాను. ప్రతి కుటుంబం ఒక తరందాకా సోషలిస్టు సమాజాన్ని, సామాజిక న్యాయాన్ని ఆచరిస్తుంది. పెంచి పోషిస్తుంది. మలితరం దాన్ని వదిలివేయడం వల్ల అసమానతలు పెరిగే క్రమాన్ని చిత్రించడానికి ఈ కథా వస్తువును తీసుకున్నాను.

'తులసి' కథ తల్లిదండ్రుల పట్ల కొడుకు కోడళ్ల ప్రవర్తించే తీరుతో వాళ్ల పిల్లలు ఎలా మారుతుంటారో తెలుపుతుంది. ఆత్మీయత కోసం తల్లులు వృద్ధాప్యంలో ఎంత అల్లాడతారో ఈ కథలో చూడవచ్చు.

'వేదవతి' కథ తన జీవితాన్ని తన చేతుల్లో లేనప్పుడు ఒడిదుడుకుల పాలైనా తన పట్టుదలతో, ధైర్యంతో తిరిగి జీవితాన్ని గెలుచుకునే క్రమాన్ని చిత్రిస్తుంది. ఇందుకు భిన్నంగా ఊహాకల్పిత ఆదర్శాలకు బలియై తిరిగి ఆ జీవితం కావాలని కోరుకునే దురదృష్టవంతురాలు గురించి 'ప్రేమధార' కథ తెలుపుతుంది.

'పంజరం', 'మమతలు' కథలను రాజకీయ, సామాజిక విశ్లేషణ అందించడానికి కథా రూపం ఇస్తే బాగుంటుంది కదా అని రాశాను. 'పంజరం' కథలో రెండు అంశాలు చిత్రించాలనుకున్నాను. ఒకటి కుటుంబ వ్యవస్థ గురించి. కుటుంబ వ్యవస్థ స్వార్థాన్ని నేర్పుతుంది. కుటుంబం ఒక పంజరం. ఒక జైలు. అందువల్ల కుటుంబ వ్యవస్థ అంతరించాలని అంటున్నారు. కుటుంబం మొత్తం సమాజాన్ని ప్రేమించే సంస్కృతిని నేర్పితే, కుటుంబం విచ్ఛిన్నమయ్యే అవసరం లేదు. ఇది ఒక అంశం. రెండో అంశం... కార్మికవర్గం నుండి, పేదరికం నుండి కష్టపడి పారిశ్రామిక వేత్తలుగా ఎదిగినవారికి... తరతరాలుగా సామాజిక ఆధిపత్యంలో ఉంటూ, మధ్య తరగతి ఆలోచనల తాలూకు పంజరంలో జీవిస్తూ, సమాజాన్ని శాసిస్తూ... వస్తున్నవారికి మధ్య సంబంధాలు, వారి సంస్కృతిలో, ఆలోచనల్లో వైవిధ్యం... అంతరాలు..., వైరుధ్యాలు... ఎలా ఉంటాయో చెప్పడం.

'వారసత్వం' కథలో1930 నుంచి సామాజిక పరిణామంలో ఏం జరుగుతూ వచ్చిందో చిత్రించాను. ఆ తర్వాతి పరిణామాలను 'మమతలు' కథ తెలుపుతుంది. 'ప్రశాంతం', 'నానమ్మ' కథల్లో చేనేత పద్మశాలి సామాజిక వర్గాలు పాత కులవృత్తులు, కొత్త వృత్తులు కూడా కోల్పోయి ఎలా జీవితాలు శిథిలమౌతున్నాయో చిత్రించాను.

ప్రపంచీకరణ ప్రభావాలతో పాత వృత్తులు, కొత్తవృత్తులు రెండూ కోల్పోతున్న తీరును 'ప్రశాంతం' కథ తెలుపుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచీకరణలో సాఫ్ట్‌వేర్ రంగంలో పెరిగిన ఉపాధి అవకాశాలను పేదలుకూడా అందిపుచ్చుకొని ఎదిగిన తీరు 'బతుకుపయనం' కథ తెలుపుతుంది.

'ఇంటల్లుడు' కథ ఎందరో జీవితాలకు సాక్ష్యం. చాలామంది ఇంటల్లుళ్ళు అత్తగారి బంధువులకు సేవలందించారు. ఆ కోణాన్ని ఎవరూ చిత్రించకపోవడం బాధించింది. అది నా కర్తవ్యంగా చిత్రించాను.

'పంజరం', 'తులసి', 'ప్యారసైట్స్' కథల్లో కుటుంబ వ్యవస్థ స్వార్థాన్ని ఎలా నేర్పుతున్నదో తల్లిదండ్రులు అందుకు ఎలా కారణమౌతున్నారో చూడవచ్చు. పిల్లల పెంపకంలో మార్పు రావాలి. కుటుంబం ఒక పాఠశాల. ఇంట్లో పిల్లలున్నారని గుర్తుంచుకొని ఇతరులపట్ల, పెద్దలపట్ల, తల్లిదండ్రులపట్ల ప్రవర్తించాలి. వారి ప్రవర్తన ద్వారా పిల్లలు నేర్చుకుంటారని గమనించాలి.

ఆదిలాబాద్ జిల్లాలోని సర్ సిల్క్ బట్టల మిల్లును బిర్లా మూసివేశాడు. దానివల్ల తొమ్మిదివేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. పిల్లల పెళ్ళిల్లు చేయలేక పోయారు. వారి జీవితాలు ఎలా కొడిగట్టిపోయాయో 'ప్రేమధార' కథలో చిత్రించాను.

జీవితంలోని కఠిన వాస్తవాలను, 'ప్రేమధార', 'ప్రశాంతం', 'వేదవతి', 'తులసి', 'ప్యారసైట్స్', 'పంజరం', 'నానమ్మ', 'వరుసలు' మనముందుంచుతాయి. జీవితంలో లేనిదేదీ ఈ కథల్లో రాయలేదు. ఇంకా ఎంతో జీవితాన్ని చిత్రించడం కథ పరిమితి రీత్యా కథ వెలుపలే ఉండిపోయింది.

'వరలక్ష్మి', 'తులసి', 'ప్రేమధార', 'ప్రశాంతం' వంటి కథలు రాస్తున్నప్పుడు అందులో చిత్రించడానికి ప్రాతిపదికలైన సజీవ పాత్రలు, జీవితాలు, సంఘటనలు గుర్తొచ్చి ఏడ్చేశాను. ఆ దుఃఖంలో ఎంతమేరకు రాయగలిగానో తెలియదు.

సుప్రసిద్ధ దర్శకులు శ్యాంబెనగల్ 1985లో పోచంపల్లి పద్మశాలి కులాల చేనేత వృత్తి... జీవితం గురించి 'సుస్మాన్' అనే గొప్ప సినిమాను తీశారు. ప్రపంచ వ్యాప్తంగా అది ఎన్నో అవార్డులు పొందింది... వారు చేసిన కృషి తర్వాత ఎన్నో ఏళ్ళకు కానీ నేను మావాళ్ళ సామాజిక వర్గ నేపథ్యాన్ని, పరిణామాలను చిత్రించడానికి పూనుకోలేకపోయాను.

ఇది చేనేత పద్మశాలీల జీవితాల గురించిన ఏర్చి కూర్చిన ప్రత్యేక కథల సంపుటిగా కనిపించడంలో ఆశ్చర్యమేమీ లేదు. అయితే ఇది అందుకు పరిమితమైంది కాదు. పద్మశాలీల గురించి మీరు రాయకపోతే ఎవరు రాస్తారు అని అడిగినందుకు ఆ సామాజిక వర్గంలో పుట్టి పెరిగినవాడిగా కొన్ని రాయడం అవసరమేనని ప్రపంచ పరిణామాలను అన్ని సామాజిక వర్గాల్లో, దేశవ్యాప్తంగా వస్తున్న మార్పులను, కుటుంబాలను వాటి పరిణామాలను చిత్రిస్తూ వాటికి పద్మశాలీలు అని పేరు పెట్టాను. అంతే. ఎవరి జీవితమైనా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. ఈ కథల సంపుటిలో ఆధునిక అభివృద్ధి, సైన్స్, టెక్నాలజీ జీవితంలో ప్రవేశించిన మేరకు వస్తున్న మార్పులు... సామాజిక పరిణామాలు... మానవ సంబంధాల తీరుతెన్నులు... సంస్కృతిలో, ఆలోచనల్లో జీవన విధానాల్లో చోటు చేసుకుంటున్న మార్పులు చిత్రించబడ్డాయి.

ఇందులోని కథలు 1996 నుండి 2013 మధ్య రాసినవి. పత్రికల్లో వచ్చినప్పుడు కొంత ఎడిట్ చేసినట్లున్నారు. పత్రికల్లో అచ్చయ్యాక చాలామంది కథల గురించి తమ అభిప్రాయాలు చెప్తూ... అనేక సూచనలు కూడా చేశారు. వాటిని దృష్టిలో ఉంచుకొని ఆయా కథల్లో కొన్ని మార్పులు, చేర్పులు చేశాను. ప్రతి కథలో ఈ మార్పును గమనించవచ్చు. పత్రికల్లో కథ ప్రచురించడానికి స్థలాభావం పరిమితి ఉంటుంది. అందువల్ల అనేక విషయాలను వదిలివేసి ముఖ్యాంశాలు మాత్రమే కథగా రాయడం జరుగుతుంది. పుస్తకంగా వేసినప్పుడు ఆ పరిమితిలోనే వేయడం దేనికి? ఆ కథలో చెప్పదలుచుకున్న విషయాన్ని కథానిక పరిమితిలో ఎంత చెప్పవచ్చో అంతమేరకు కొత్తగా చేర్చడం అవసరం. ఇలా పత్రికల్లో, కథా సంకలనాల్లో చేర్చిన తర్వాత కూడా ఈ కథల సంపుటిగా తెస్తున్నప్పుడు చాలా మార్పులు, చేర్పులు చేశాను. నాకు నచ్చేదాక కథల్లో మార్పులు చేర్పులు చేస్తూనే వచ్చాను. అందువల్ల ఇవి కొత్తగా మళ్లీ రాసిన కథలుగానే భావించవచ్చు.

ఈ కథలు చదివి మీ స్పందన తెలుపాల్సిందిగా కోరుతున్నాను.

## ఉపమానాలు పేనలేను

నేను ఉపమానాలు పేనలేను
ఉపోద్ఘాతాలు అసలే చెప్పలేను
గుండెను పిండలేను
మనసును తొలుచలేను
అందరిని ఆకర్శించుకోవాలనే ఆశలేదు
ఉన్నతుని అనే చెప్పుకోవాలనే
ద్యాసలేదు.
నాకోసం నావారు ఉంటారు
వారి ద్యాసలో
నా విశ్వాసాన్ని విశ్వసిస్తరు
రేపటి ఉదయంలో
హృదయాన్ని అందిస్త..
నేను ఓ నిశ్శబ్దంలో ఘనీభవిస్తే
వారి చూపుల ప్రేరణతో ద్రవీభవిస్త
మధురమైన
భావాల కవితనై ప్రవహిస్తా.
ఎప్పుడు నేను ఏకాకినే
నాలోనేను ఉన్నప్పుడు
తరువాత నిజమైన కవిత్వ బంధువునే
అప్పుడప్పుడు
నా లోకంలోంచి నిశ్శబ్దంగా
మీ లోకంలోకి వలస వస్తుంటాను.
మీ ఆత్మీయ తీరాల చుట్టూ
నా కవిత్వం అంచును
నిలుపుతుంటా.
నా మనసులోతులో వారే
నా భావాల లోతులో వారే
ఎవరు స్వీకరించినా
స్వీకరించకపోయిన
నేను చెప్పేది ఇది నిజం
నిత్యం ఎక్కడో ఒకదగ్గర
కన్నీటి గాథలో
నా కవిత్వాన్ని తడుపుతుంట.
మనం సగటు మనుషులం
మనలో ఏ చాటువులు లేవు
మనబతుకులో ఏదో ఓ సిద్ధాంతం
ఎవరికి
తెలువకుండానే లేవనెత్తుతుంది
చాలామందికి తెలువదు.
మన అనుబంధంలో అనుకోని...
అవరోధాలు
ఎన్నెన్నో రెచ్చగొడుతుంటాయి!.
మాటలతో మత్తెక్కించే మస్తిష్కాలెన్నో
అప్పుడప్పుడు గుండెల్ని
గాయపరుస్తుంటాయి..
మోయలేనంత బాధను
మోపుతుంది
సృష్టిస్తుంది లోతుల్ని
చూపిస్తుంది లోయల్ని..
అనంత శూన్యంలో
పరుగెత్తమంటుంది.
అప్పుడే వివిధ పార్శ్వాలతో కూడిన
బాహువులు
కవిత్వపు అగ్ని జ్వాలలై లేస్తుంది
రాలే నిప్పురవ్వలై
కాల్చేస్తుంది కలతల్ని!..
కూల్చేస్తుంది మానసిక ఒత్తిళ్ళను!..
ఓ ఆకృతి తెస్తుంది ప్రభాతాన్ని...
ఓ అద్భుతం
నింపుతుంది వసంతాన్ని.
నా కవితకు గుండె ఉంది
నిండైన మనసు ఉంది
అప్పుడప్పుడు
క్రోధం పుడుతుంది
కోపం తెప్పిస్తుంది
ఆర్ద్రత ఉంది
అనురాగం పంచుతుంది
అలక ఉంది ఆలోచింప జేస్తుంది
ప్రేమను పేనుకొనే ప్రాణం ఉంది
ఇంతకన్నా కవిత్వాన్నికి
ఏమి ఉండాలి
అందరికొరకై కవిత్వం పుట్టాల్లి
కొందరిని పలుకరిస్తూ
పలువరిస్తు ఉండాలి!!...



-అంబటి నారాయణ
9849326801

# బాలల కథా సంకలనం

సుమారు ఒక అర్థ శతాబ్దం నుండి అంటే కంప్యూటర్‌లు, సాఫ్ట్‌వేర్ రంగం ప్రాచుర్యంలోకి వచ్చాక ప్రపంచ పటం సముద్రమంత మార్పుకు లోనయింది. అన్ని రంగాలలోనూ వేగం చోటు చేసుకుంది. వ్యాపార మయం అయిపో యింది. సంస్కృతికి జీవగర్రయైన సాహిత్యాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ నేపథ్యంలో గ్రీష్మంలో తొలకరి జల్లులా రచయిత్రి, కవయిత్రి సాహిత్య విమర్శకురాలు డా॥ కొండపల్లి నీహారిణి నడుం బిగించారు. గృహిణిగా బాధ్యతలు నెరవేర్చుతూనే, 'మయూఖ' అను అంతర్జాల పత్రికను స్థాపించి తెలుగు సాహిత్య సంరక్షణం గావిస్తున్నారు. కథ, వ్యాసం కవిత్వం- కాదేదీ అనర్హం అంటూ తెలుగు రచయితలను తమ పత్రిక ద్వారా ప్రోత్సహిస్తున్నారు.

అత్యంత ప్రభావపూరితమైన బాల సాహిత్యానికి మయూఖలో సముచిత స్థానం కల్పించి, బాల కథా రచయితలైన పెద్దవారిని, మరియు బాలురను ప్రోత్సహిస్తున్నారు. అద్భుత లోకాలకు బాలురను తీసుకు వెళ్ళగలిగేది, వారిలో జిజ్ఞాస రేకెత్తించగలిగేది, చిన్నతనాన వారిని మంచి మార్గంలోకి నడిపించగలిగేది, వారికి అత్యంత ఇష్టమైన- కథా ప్రక్రియను 'మయూఖ' దోహదం చేస్తున్నది. ఈ ప్రయత్నంలో భాగంగా లోగడ మయూఖలో ప్రచురించబడిన 35 పిల్లల కథలను 'బాల కథా మయూఖం" అన్న పేరుతో తీసుకువచ్చిన కథల సంకలనమిది. ఇందు లోని కథలు పిల్లల మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి. విజ్ఞానవంతులను చైతన్యవంతులను చేసి భావికి బంగారు బాటలు వేస్తాయి. 'మొలక' మాసపత్రిక సంపాదకులు శ్రీ వేదాంత సూరిగారు అన్నట్లు' కథలు పిల్లలలో జిజ్ఞాసను పెంపుచేసి ప్రశ్నించే తత్వాన్ని పెంచుతాయి". సంకలనంలో 20






ప్రతులకు:
కొండపల్లి నీహారిణి
ఇ.నెం.16-559, శ్రీశ్రీ హెూమ్స్,
అల్మాస్‌గూడ, బాదంగ్‌పేట్,
బాలాపూర్ మం॥
హైదరాబాద్-500 058
సెల్: 9394592727

కథలు పెద్దవారు వ్రాసినవి కాగా, మిగిలిన 15 కథ/ వ్యాసాలను చిన్నారులు వ్రాసారు. ఒద్దిరాజు మురళీధర్ రావు శాంతి ప్రబోధ, సంగనభట్ల చిన రామకిష్టయ్య కూర చిదంబరం. కందేపిరాణిప్రసాద్, సమ్మెట ఉమాదేవిలాంటి బాలల కథా రచయితలు తమ కథల్లో నీతిని బోధించారు. తలిదండ్రులకు తమ పిల్లలందరూ సమానమేనన్నారు. బాధ్యతలు సరైన పద్ధతిలో నిర్వహించాలని లేకపోతే అతివృష్టి అనావృష్టి అవుతుందన్నారు. భిన్నత్వంలోనే ఏకత్వం అందం అన్నారు. సోమరితనం కూడదు అని చెప్పారు. చెప్పుడు మాటలు విని మోస పోవద్దని, దూరపు కొండలు, నునుపు అని తెలియచేసారు. శ్రీ రామచంద్రుడు, గజేంద్రుడు, వేదవ్యాసుడు, అశ్వత్థామ, విశ్వామిత్ర, వాల్మీకి, మంథరలాంటి పౌరాణిక పాత్రలను బాలురు విశ్లేషించిన తీరుబ బాగుం ది. అంత చిన్న వయసులోనే వారికి ఉన్న పరిణతి గమనిస్తే, చదువరి అబ్బుర పడతాడు. చిన్నారి సాత్విక లక్ష్మణుడి తల్లియైన సుమిత్రలో వివేకం, ఉదాత్తత గమనించింది. సముదాటి గౌతమ్ భారతం కథ కుక్కతో మొదలై (జనమేజయుడి యజ్ఞ) కుక్కతో ముగుస్తుందని (స్వర్గారోహణం) చెప్పటం చిరంజీవి కుశాగ్రబుద్ధికి, శోధనాసక్తికి గొప్ప తార్కాణం.

తెలుగు భాషలో సాహిత్యం ప్రాముఖ్యత ఇతర దక్షిణ భారత దేశ భాషలకంటే తక్కువే! అందునా బాల సాహిత్యం పాలు మరీ తక్కువ! చదవాలన్న ఉత్సాహం చిన్నారులకు ఉన్నా, తలిదండ్రుల ఆర్థిక సాయంపై ఆధారపడాలి. అందునా, ఏదైనా సందర్భాలలో బహుమతిగా పుస్తకాలు ఇచ్చే అలవాటు మనలో చాలా తక్కువ.

ఈ మధ్యకాలంలో ఈ 'ట్రెండ్' మారుతున్నది. జన్మదిన పార్టీలు మరి ఇతర బాలుర పార్టీలకు పుస్తకాలను గిఫ్ట్‌గా ఇస్తున్నారు. పిల్లల అభిరుచులు ఏమిటో కనుక్కొని పెద్దలు తమ పిల్లలకు మంచి మంచి పుస్తకాలను అందచేస్తున్నారు.

ఈ దిశగా డా॥ కొండపల్లి నీహారిణి చేస్తున్న తన వంతు ప్రయత్నం బహుధా ప్రశంసనీయం. బాల సాహిత్యానికి బంగారు బాటలు వేస్తోన్న నీహారిణి గారికి అభినందనలు.



- కూర చిదంబరం
సెల్: 8639338675

# చిలుక తెలివి



సుందరవనం అనే అడవిలో ఒక రామ చిలుక చెట్టు పైన వాలింది. అది వెంటనే నేలపైకి వచ్చి పరధ్యానంగా ఉన్న సమయంలో దానిని వెనుకనుంచి వచ్చిన ఒక నక్క అమాంతంగా పట్టుకుంది. ఆకస్మికంగా తనను నక్క పట్టుకునే సరికి ఆ చిలుక ఆశ్చర్యపోయింది. అది ఇక తనకు నక్క చేతిలో చావు తప్పదనుకొంది. ఆ నక్క చిలుకను పట్టుకొని సంతోషంతో పరిగెత్త సాగింది.

ఆ చిలుక ఒక వేటగాడిని ఉదయమే చూసింది. అది ధైర్యంగా " ఓ నక్కా! ఈ అడవిలో ఒక వేటగాడు తిరుగుతున్నాడు. అతడు మీ నక్కల కొరకే ఈ అడవికి వచ్చాడట. నేను చెప్పేది నిజం. కావాలంటే మా పక్షులను వేటినైనా నీవు అడుగు. నీకే తెలుస్తుంది. ఒక పెద్ద వలతో అతడు తిరగడం నేను చూశాను. నీవు ఈ వైపుకు వెళ్ళకు. అతడు ఈ వైపే ఉన్నాడు" అని అంది .

అది విన్న నక్క "అదేం కాదు. నువ్వు తప్పించుకోవాలని ఈ మాటలు చెబుతున్నావు. ఎక్కడైనా పక్షుల కొరకో,ఇతర జంతువుల కొరకో వేటగాడు వస్తాడు కానీ మా నక్కల కొరకు ఎవ్వరూ రారు.నీవు చెబుతున్నవి అన్నీ అబద్ధాలే. ఈ వైపు వేటగాడు ఉండడని నాకు తెలుసు" అని అంది. ఇంతలో చిలుక చెప్పినట్లే ఒక వేటగాడు ఒక వలతో పాటు వాటికి ఎదురుగా ఆ దారిలో రాసాగాడు. అతడు " ఓ నక్కా! ఆగు...ఆగు.." అంటూ కేక పెట్టాడు. అతడిని చూసిన నక్క భయంతో ఆ చిలుక చెప్పినది నిజమేననుకొని దానిని వదిలిపెట్టి వెనుకకు తిరిగి పారిపోయింది.

అతడు వెంటనే ఆ చిలుక పైన వలను విసిరాడు. అతడు పక్షుల వేటగాడు. అందువల్ల అతని వలలో చిలుక చిక్కింది. అది నక్క నోటిలో గాయపడటం వల్ల పైకి ఎగరలేకపోయింది. ఆ వేటగాడు చిలుక వలలో పడినందుకు ఎంతో సంతోషించి" అమ్మయ్యా! ఇక్కడికి మిగతా పక్షులు వస్తాయి. వాటిని కూడా నేను వేటాడవచ్చు" అని అనుకున్నాడు. చిలుక తాను అజాగ్రత్తగా ఉండి ముందు నక్కకు చిక్కినందుకు ఎంతో విచారించింది. అది తప్పించు కున్నప్పటికినీ ఈ వేటగానికి చిక్కినందుకు మరెంతో చింతించింది. కొన్ని పక్షులు చిలుకను విడిపించుటకు వచ్చి ఆ వేటగాన్ని చూసి భయంతో పారిపోయాయి .చివరికి ఆ చిలుకకు ఒక ఉపాయం తోచింది. అది వెంటనే ఆ వలలో వేటగాడు చూస్తూ ఉండగా గిలగిలా కొట్టుకోవడం ప్రారంభించింది. అది చూసిన వేటగాడు "అయ్యో! ఈ చిలుక నక్క నోటికి చిక్కి గాయపడింది. ఇది ఇక బ్రతకదు. చావబోయే ఈ చిలుక నాకెందుకు? ఈ చిలుకను వదలిపెట్టి ఇతర పక్షుల కొరకు వెళ్లడం మంచిది" అని ఆ వలను తప్పించి వలతో పాటు వెళ్లిపోయాడు.కొద్దిసేపు ఆగిన తర్వాత అతడు వెళ్లిపోవడం చూసిన ఆ చిలుక ఎంతో సంతో షించింది. అది కొద్దిగా తేరుకొని అమాంతంగా రెక్కలతో పైకి లేచి తన నివాసా నికి వెళ్ళిపోయింది. దాని ఉపాయానికి మిగతా పక్షులన్నీ ఆ చిలుకను అభినందించాయి.



-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535

